# ప్రజాశక్తి

ఆదివారం 28 డిసెంబర్ 2025 | 8 పేజీలు

ప్రకాశం | బాపట్ల






'మార్కాపురం జిల్లా'పై

## స్వల్ప మార్పులు.!

- దొనకొండ, కురిచేడును మార్కాపురంలో కలిపే యోచన
- పొదిలి తిరిగి 'ప్రకాశం'లో కలపాలని సమీక్షలో చర్చ
- నేడు జరగనున్న కేబినెట్ సబ్‌కమిటీలో తుది నిర్ణయం

**ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో**

అభ్యంతరాల ప్రక్రియ శనివారంతో ముగియడంతో కొత్త జిల్లాలపై సిఎం చంద్రబాబు సమీక్ష చేశారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై నియమించిన కేబినెట్ సబ్‌కమిటీతో చంద్రబాబు శనివారంనాడు భేటీ అయ్యారు. వచ్చిన అభ్యంతరాలు, సూచనలు, సలహాలపై సమీక్ష చేశారు. మార్పులు, చేర్పులు చేయాల్సిన అంశాలపైనా చర్చించారు. మార్కాపురం జిల్లాలో స్వల్పమార్పులకు చర్చ నడిచింది. దర్శి నియోజకవర్గంలోని దొనకొండ, కురిచేడు మండలాలను మార్కాపురం జిల్లాలో కలపాలనే చర్చ సాగినట్లు సమాచారం. అదేవిధంగా పొదిలి మండలాన్ని ప్రకాశంలో కలపాలని నిర్ణయించినట్లు తెలిసింది. దర్శి నియోజకవర్గాన్ని మార్కాపురం జిల్లాలో కలపాలని ఆ ప్రాంత పార్టీల నేతలు కోరుతున్నారు. దీనిపైనే ఎక్కువ అభిప్రాయాలు, వినతులు ప్రభుత్వానికి వెళ్లాయి. అయితే అక్కడ ఎమ్మెల్యే ▶ 2లో

పేదల కడుపు కొట్టేందుకే

## 'ఉపాధి' చట్ట సవరణ

▶ 4లో

# పోరాటాలే..పరిష్కార మార్గాలు..

- సిఐటియు ఉద్యమాలతో పలు సమస్యలు పరిష్కారం
- గత మూడేళ్లలో సాధించిన విజయాలెన్నో..

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

**కార్మిక వర్గాన్ని అణిచివేసే విధానాలు ఎంత బలంగా ఉన్నా, సంఘటిత పోరాటం ఎదుట అవి వెనక్కి తగ్గక తప్పదు అన్న సత్యాన్ని గత మూడేళ్ల సిఐటియు ఉద్యమాలు నిరూపించాయి. ప్రకాశం జిల్లావ్యాప్తంగా సాగిన ఈ ఉద్యమాలు కేవలం నిరసనలుగా కాకుండా వేతనాల పెంపు, హక్కుల సాధన, ఉపాధి భద్రత, తొలగింపులకు ఎదురుదెబ్బగా స్పష్టమైన ఫలితాలతో నిలిచాయి. డిసెంబర్ 31 నుంచి విశాఖపట్నంలో జరగనున్న సిఐటియు అఖిలభారత మహాసభల సందర్భంగా ప్రత్యేక కథనం..**

2023 ఎంఎల్‌సి ఎన్నికల సందర్భంగా మూడు నెలల పాటు సాగిన సీఐటీయూ ప్రచారం కార్మిక ఉద్యమానికి రాజకీయ చైతన్యాన్ని అందించింది. జిల్లాలో 40 మండలాల్లో 60 దళాలతో, 300 మంది కార్యకర్తలు ప్రభుత్వ కార్యాలయాలు, నివాస ప్రాంతాల్లో పిడిఎఫ్ అభ్యర్థులకు మద్దతుగా సాగించిన క్యాంపెయిన్లు కార్మిక వర్గాన్ని సంఘటితం చేసే దిశగా కీలక పాత్ర పోషించాయి. ఈ ప్రచారం ద్వారా కొత్త పరిచయాలు, కొత్త శక్తులు ఉద్యమానికి జతయ్యాయి.




### పోరాటాల ప్రభంజనం..

మున్సిపల్ రంగంలో రెండు సార్లు జరిగిన సమ్మెలు పారిశుద్ధ కార్మికుల జీవితాల్లో కీలక మార్పులు తెచ్చాయి. హెల్త్ అలవెన్స్‌తో కలిపి కార్మికుల నెల జీతం రూ.21,000గా నిర్ణయించబడింది. రిటైర్మెంట్ బెనిఫిట్లు, అంత్యక్రియ ఖర్చులు పెరిగాయి. ఇంజనీరింగ్ కార్మికులకు జీతాలు రూ.16,000 నుంచి రూ.24,000 వరకు పెరగడం పోరాటాల ఫలితమే.

### కార్మికుల హక్కుల సాధన..

మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఆందోళన ఫలితంగా మెనూ ▶ 2లో

# పోరాటాలే..పరిష్కార మార్గాలు..

(మొదటిపేజీ తరువాయి)

ఛార్జీలు పెరిగాయి. స్వచ్ఛభారత్ కార్మికులకు హెల్త్ అలవెన్సులు పెంచేలా ప్రభుత్వం నిర్ణయించాల్సి వచ్చింది. పట్టణ ఆర్‌పిలు, వీఓలకు మూడేళ్లకు ఒకసారి ఇవ్వాల్సిన కంట్రిబ్యూషన్‌ను పోరాట ఫలితంగా పెండింగ్‌లో పెట్టిన ప్రభుత్వం చివరకు విడుదల చేయక తప్పలేదు.

**సమ్మె ప్రభావం..**

సమగ్రశిక్షలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు 20 రోజుల పాటు సమ్మె బాట పట్టారు. ఈ పోరాటంతో 8 కేటగిరీల ఉద్యోగులకు 3 శాతం వేతనాలు పెరిగాయి. ఎంఎటిఎస్–హెచ్‌ఆర్ పాలసీపై కమిటీ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.

**అన్యాయాలపై విజయం...**

విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలపై చేపట్టిన ఉద్యమం ఫలితంగా 2022 పీఆర్‌సీలో జరిగిన అన్యాయాన్ని సరిదిద్దుతూ అరియర్స్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.రెగ్యులరైజేషన్ కోసం కమిటీ ఏర్పాటు చేయడం పోరాట విజయానికి నిదర్శనం. విఆర్‌ఎలకు గత ప్రభుత్వం కోత విధించిన
రూ.500 డీఏ తిరిగి మంజూరు కావడం సీఐటీయూ ఉద్యమ ఫలితమే.

**చిన్న వ్యాపారులకు రక్షణ...**

కనిగిరిలో వీధివ్యాపారుల తొలగింపుకు వ్యతిరేకంగా దశలవారీ ఉద్యమం సాగింది. మార్కాపురం, పొదిలి, చీమకుర్తి, గిద్దలూరు, పామూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లో రోడ్డు మార్జిన్లు, పుట్ పాత్ లపై, రోడ్ల పై చిరు వ్యాపారం చేసుకుని ఉపాధి పొందే వారి బంకులు తొలగింపులపై జోక్యం చేసుకొని ఆందోళన చేపట్టిన ఫలితంగా సమస్యలు పరిష్కరించబడ్డాయి. కాగా మార్కాపురంలో ఇతర రాష్ట్రాల మొబైల్ షాపుల దోపిడీకి వ్యతిరేకంగా
స్థానిక వ్యాపారులు ఐక్యమై యూనియన్ ఏర్పాటు చేసుకోవడం ఉపాధి రక్షణలో కీలకంగా నిలిచింది.

**పరిశ్రమల పోరాటాలు - ఒప్పందాల దిశగా...**

మార్కాపురం డిజైన్ స్టోన్ రంగంలో 2023–2026 మధ్య జరిగిన సమ్మెలు యజమానులను చర్చల బల్లపైకి తీసుకొచ్చాయి. కార్మిక శాఖ సమక్షంలో వేతన ఒప్పందాలు కుదిరాయి.

**టోల్ ప్లాజా కార్మికుల సమస్యలు..**

టంగుటూరు నేషనల్ హైవే టోల్ ప్లాజా కార్మికులు 13 రోజుల నిరవధిక పోరాటంతో గ్రాట్యూటీ, లీజ్ ఎన్ క్యాష్‌మెంట్‌తో పాటు ఇతర పెండింగ్ డిమాండ్లు పరిష్కారమయ్యాయి.

**చీమకుర్తి గ్రానైట్ రంగంలో...**

చీమకుర్తి ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమల్లో తరచూ జరిగే ప్రమాదాల వల్ల ప్రాణాలు కోల్పోతున్న వారి కుటుంబాలకు ప్రమాద పరిహారం, పెండింగ్ వేతనాలు సాధించబడ్డాయి.

**తొలగింపులకు ఎదురుదెబ్బ**

రాజకీయ కారణాలతో తొలగించిన మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, ఇతర స్కీమ్ వర్కర్లను ఆందోళన ఫలితంగా తిరిగి విధుల్లోకి తీసుకోవలసి వచ్చింది. విద్యుత్ రంగంలో పోరాటాల్లో పాల్గొన్నారన్న కారణంతో తొలగించిన 13 మందిని తిరిగి ఉద్యోగాల్లో చేర్పించారు. కనిగిరి ఆర్టీసీ గ్యారేజీలో సూపర్వైజర్ దౌర్జన్యానికి వ్యతిరేకంగా సాగిన పోరాటం కార్మికుల విజయంతో ముగిసింది. గత మూడేళ్ల సీఐటీయూ ఉద్యమాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి. పోరాటం లేకుండా హక్కులు రావు. సంఘటితంగా నిలబడితే ప్రభుత్వాలు, యాజమాన్యాలు తలవంచక తప్పదు. ఈ ఉద్యమాలే రాబోయే రోజుల్లో మరింత బలమైన కార్మిక పోరాటాలకు దిశానిర్దేశం చేస్తాయి.

## 'మార్కాపురం జిల్లా'పై స్వల్ప మార్పులు.!

(మొదటిపేజీ తరువాయి)

బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఈ నిర్ణయంపై మౌనంగా ఉన్నారు. దర్శి టిడిపి ఇన్‌చార్జి గొట్టిపాటి లక్ష్మి దర్శిని ప్రకాశంలోనే ఉంచినందుకు సిఎం చంద్రబాబుకు పాలాభిషేకాలు నిర్వహించారు. అయితే మార్కాపురం జిల్లాలో కనీసం దొనకొండను కలిపితే ఎయిర్‌పోర్టుతో పాటు పరిశ్రమలు ఆ జిల్లాకు వనరులుగా ఉంటాయనే చర్చ కూడా ముందుకు వచ్చింది. ఆ మండలంలో సీనియర్ సిటిజన్లు కూడా మార్కాపురం జిల్లాలోనే దొనకొండను కలపాలని విన్నవించారు. ఇప్పుడు వచ్చిన వినతుల ఆధారంగానూ, మార్కాపురం కేంద్రానికి సమీప మండలాలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ రెండు మండలాలను మార్కాపురం జిల్లాకు కలపాలనే ఆలోచన చేసినట్లు తెలుస్తోంది. దర్శి నియోజకవర్గాన్ని మొత్తం ప్రకాశం జిల్లాలోనే ఉంచేలా టిడిపి నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై సిఎం చంద్రబాబు సూచనలు ఆధారంగా నిర్ణయం తీసుకోనున్నారు. ఆదివారం నాడు కేబినెట్ సబ్‌కమిటీ జరగనుంది. ఈ సమావేశంలో మార్పులు చేర్పులపై తుది నిర్ణయం తీసుకుంటారు. సోమవారం నాడు జరిగే కేబినెట్ సమావేశంలో ఆమోదించాక ఈ నెల 31న నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

## సీఎం చంద్రబాబుకు పాస్టర్ల కృతజ్ఞతలు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పాస్టర్లు హర్షాతిరేకాలతో శనివారం సంబరాలు నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాస్టర్లకు 12 నెలల వేతనం రూపంలో ఒక్కొక్కరికి రూ.60,000ను నేరుగా వారి బ్యాంక్ ఖాతాల్లో జమ చేయించిన సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు నాయకత్వం వహించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాస్టర్లు పాలాభిషేకం చేసి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పాస్టర్లు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తక్కువ సమయంలోనే ఇచ్చిన హామీలను అమలు చేస్తూ, తమకు ఆర్థిక భరోసా కల్పించినందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పాస్టర్ల సంక్షేమాన్ని గుర్తించి, వారికి గౌరవం కల్పించిన నాయకుడు చంద్రబాబు నాయుడేనని వారు కొనియాడారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పాలన సాగిస్తోందని అన్నారు. పేదలు, మైనారిటీలు, బలహీన వర్గాల సంక్షేమానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చిట్యాల వెంగళరెడ్డితో పాటు పెద్ద సంఖ్యలో పాస్టర్లు పాల్గొన్నారు.

# అత్యవసర రన్‌వే మాకొద్దు

- సమావేశమైన నాలుగు గ్రామాల ప్రజలు
- ప్రమాదాలకు నిలయంగా రన్‌వే
- శింగరాయకొండ నుంచి తరలించాలంటూ తీర్మానం

**ప్రజాశక్తి-శింగరాయకొండ**

శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని కనుమల్ల కలికివాయి మధ్య జాతీయ రహదారి మీద అత్యవసర రన్వే ప్రమాదాలకు నిలయంగా ఉండడం తో పాటు ప్రజలకు రైతులకు తీవ్ర ఇబ్బంది కలిగిస్తున్న ఈ రన్వే మాకొద్దు మాకొద్దు అంటూ ఈ రన్వేని సింగరాయకొండ నుంచి తరలించాలంటూ శనివారం నాడు శింగరాయకొండ మండలం మూలగుంట పాడు గ్రామంలో ఉన్న కాకతీయ కళ్యాణ మండపంలో నాలుగు గ్రామాల రైతులు ప్రజలు రాజకీయ పార్టీలతో పాటు ప్రజా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2019 సంవత్సరంలో ఈ అత్యవసర ల్యాండింగ్ సౌకర్యం కోసం అభివృద్ధి కోసం ఒప్పందం చేయటం జరిగిందని 2021 సంవత్సరానికి పూర్తి అవ్వటం కూడా అయిందని అయితే భారత వైమానిక ధర బృందం సంయుక్తంగా తనిఖీ చేసి ఇక్కడ చాలా పొరపాట్లు జరిగాయని గుర్తించడం జరిగిందన్నారు. చిన్నచిన్న మలుపులు ఉండడం ద్వారా ఇబ్బందులు ఉంటాయని దీనికోసం మరోసారి టెండర్లకు పిలిచి ఆరు కోట్ల రూపాయలతో భూసేకరణ చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు

ఈ నేపథ్యంలో మరోసారి భూసేకరణ చేయడంతో పాటు ఈ అత్యవసర రన్‌వే పూర్తయితే చుట్టుపక్కల ప్రాంతంలో రాకపోకలకు ఇబ్బందులు జరుగుతాయని, దీనివల్ల ఇప్పటికే ఎంతోమంది మరణించారని, గ్రామాల మధ్యలో ఉన్న ఈ రన్‌వే ద్వారా ప్రమాదాలు అధికమవుతాయని, అభివృద్ధి కుంటుపడుతుందని పలువురు వివరించారు. ప్రభుత్వం మరోసారి చేపడుతున్న భూసేకరణలో చాలా ఇబ్బందులు ఉన్నాయని వివరించారు. ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు జె జయంతి బాబు మాట్లాడుతూ గ్రామసభలు జరక్కుండా భూసేకరణ చట్టం ఎలా అమలవుతుందని మండిపడ్డారు. కరేడు ప్రజలను ఇండో సోల్ పేరుతో ఇప్పటికే కులాలు, మతాలు పార్టీల వారీగా విభజించి అక్కడ చిన్న సన్న కారు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుందని అక్కడ దుర్మార్గంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. ఈ అత్యవసర రన్‌వే వలన ఈ ప్రాంతంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితి వస్తుందని వివరించారు. రైతులకు నష్టం జరిగే విధంగా ఈ ప్రాజెక్టు ఉందని, దీనిని ఎలా నిలుపుదల చేయాలో అందరూ కూర్చొని మాట్లాడుకొని ఒక మాట మీదకు రావాలని వివరించారు. రైతుల కోసం ఏపీ రైతు సంఘం ఎప్పుడు అండగా ఉంటుందని తెలిపారు. ప్రముఖ న్యాయవాది, మాజీ సర్పంచ్, టిడిపి ఒంగోలు పార్లమెంటు లీగల్ సెల్ అధ్యక్షులు సన్నెబోయిన శ్రీనివాసులు నాయుడు, మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రన్‌వే వలన ఈ ప్రాంత రైతులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దొడ్డ కరుణాకర్‌రెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షులు అయినాబత్తిన రాజేష్, సిపిఎం నాయకులు టంగుటూరి రాము, రైతు సంఘం నాయకులు హనుమారెడ్డి, లక్ష్మీ, టిడిపి నాయకులు చిగురుపాటి శేషగిరి, సన్నిబోయిన వెంకటేశ్వర్లు, అంబటి శ్రీను, గ్రామస్తులు నరాల సుధాకర్, కొనికి మురళీకృష్ణ, రైతులు, గ్రామస్తులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

# నాణ్యమైన విద్యుత్తు అందించాలి

**ప్రజాశక్తి-పొదిలి**

ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు బకాయిల వసూళ్లలో అలసత్వం వహించవద్దని ప్రకాశం జిల్లా ఏపీ సీపీడీసీఎల్ సూపరిండెంటెండ్ ఇంజనీర్ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విశ్వనాథపురంలోని సబ్ స్టేషన్ కార్యాలయం సందర్శించారు. ఈ సందర్భంగా విద్యుత్ సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్యుత్‌ను అందించే విషయంలో ఎటువంటి రాజీ లేదన్నారు. ఫీడర్ల వారీగా విద్యుత్ వినియోగంపై ప్రణాళికా బద్ధంగా పనిచేయాలని సూచించారు. అదే క్రమంలో మండలంలో సుమారు మూడు కోట్ల రూపాయల విద్యుత్ బకాయిలు పేరుకుపోయాయని, వసూలు చేసే విషయంలో అలసత్వం వహించవద్దని హెచ్చరించారు. ముందుగా సబ్‌స్టేషన్‌కు సంబంధించి రహదారి ఏర్పాటుకు



విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటేశ్వర్లు

స్థల పరిశీలన చేశారు. సుమారు 50 సంవత్సరాలకు పైగా ఇక్కడ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు సేవలందిస్తున్న ఈ కార్యాలయానికి సరైన రహదారి లేకపోవడంపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. సబ్‌స్టేషన్‌కు సరైన రహదారి కోసం జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు చేయాలని అధికారులు, సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో దర్శి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పాలగిరి శ్రీనివాసులు, పొదిలి ఏడీఈ దాండ్లపాటి హరిబాబు, ఏఈ కామసాని మోహన్‌రెడ్డి, విద్యుత్తు లైన్‌మెన్లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

# 31నే పెన్షన్ల పంపిణీ

## డిఆర్‌డిఎ పీడీ టి నారాయణ

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్లను ఒక రోజు ముందుగానే లబ్ధిదారులకు పంపిణీ చేయనున్నట్లు డీఆర్డీఏ-వెలుగు ప్రాజెక్టు డైరెక్టర్ టి నారాయణ శనివారం తెలిపారు. జనవరి 1వ తేదీకి బదులుగా డిసెంబర్ 31నే పెన్షన్లు అందించడంతో వృద్ధులు, దివ్యాంగులు, ఇతర లబ్ధిదారులు కొత్త సంవత్సరాన్ని ఆర్థిక భరోసాతో ప్రారంభించగలుగుతారని ఆయన పేర్కొన్నారు. ప్రకాశం జిల్లాలో 2.62 లక్షల మందికి పైగా లబ్ధిదారులకు రూ.125 కోట్లకు పైగా పెన్షన్లు సజావుగా పంపిణీ చేసేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన ఏర్పాట్లు చేసిందన్నారు. గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో ఇంటింటికీ పెన్షన్లు అందజేయడమే లక్ష్యంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. డిసెంబర్ 31న అందుబాటులో లేని వారికి జనవరి 2న పెన్షన్లు అందేలా ఏర్పాట్లు చేశామని, ఎక్కడా లబ్ధిదారులకు ఇబ్బందులు తలెత్తకుండా పర్యవేక్షణ కొనసాగుతుందని పీడీ స్పష్టం చేశారు. ముందస్తు పంపిణీ నిర్ణయం ప్రభుత్వం లబ్ధిదారుల సంక్షేమానికి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని ఆయన అభిప్రాయపడ్డారు.

# వ్యాపారిపై ఎస్ఐ దాడి దురదృష్టకరం: ఎమ్మెల్యే

**ప్రజాశక్తి-పొదిలి**

ఈ నెల 24వ తేదీన పొదిలి పట్టణంలోని ప్రధాన రహదారిలో ఒక ఎరువు వ్యాపారి కుమారుడిపై ఎస్ఐ వేమన దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన దురదృష్టకరమని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి అన్నారు. శనివారం ఆయన పట్టణంలోని అమ్మవారిశాల వీధిలో ఉన్న ఎరువుల వ్యాపారి యాదాల కోటేశ్వరరావు ఇంటికి వచ్చి జరిగిన సంఘటనపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా క్రిస్మస్ పండుగ సందర్భంగా 24వ తేదీన పండుగ రద్దీగా ఉన్న సమయంలో తమకు చెందిన ఎరువుల లారీ అత్యధిక బస్తాలను కాంప్లెక్స్‌లో దింపి కొద్ది మొత్తంలో ప్రధాన రహదారిలో ఉన్న దుకాణంలో దించేందుకు వస్తున్న సమయంలో వెనుక నుంచి వస్తున్న పోలీసు వాహనం ట్రాఫిక్ రద్దీని నియంత్రించే క్రమంలో లారీ డ్రైవర్‌పై దాడి చేశారన్నారు. వాహనాన్ని వెనక్కు తీసుకువెళ్లాలని డ్రైవర్‌కు తాము సూచించినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోవడంతో ఎస్ఐ ఎరువుల బస్తాలు ఎవరివని అడిగి తనను నానా దుర్భాషలాడి తనపై దాడి చేశాడన్నారు. అనుకోకుండా తనపై దాడికి దిగడంతో ఎందుకు కొడుతున్నారని ప్రశ్నించడంతో తనను పోలీస్ జీబులో ఎక్కించుకుని స్టేషన్‌కు తరలించారన్నారు. వాహనంలో దారివెంట పోలీసులు తనపై పిడి గుద్దులు గుద్ది దాడి చేసి గాయపరచారన్నారు. పోలీస్ స్టేషన్‌కు వెళ్లిన తరువాత



ఎస్ఐ దాడిలో గాయపడిన వ్యాపారి కుటుంబాన్ని పరామర్శించి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కందుల

కూడా అక్కడ ఎస్ఐ విచక్షణారహితంగా బెల్టుతో దాడి చేయడంతో తాను తీవంగా గాయపడి రక్తస్రావం జరిగిందన్నారు. కాళ్లు, చేతులు, నడుము వద్ద బొబ్బలు పడేలా కొట్టారన్నారు. ఎడమ చేతికి రక్తస్రావం అయి వాచిందన్నారు. ఈ సంఘటనపై తన తండ్రి యాదాల కోటేశ్వరరావు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అడగ్గా ఆయనను కూడా వృద్ధుడని కూడా చూడకుండా ఎస్ఐ దాడిచేసి గాయపరిచినట్లు తెలిపారు. అనంతరం టిడిపి నాయకులు గునుపూడి భాస్కర్, టిడిపి నాయకుల దృష్టికి తీసుకువెళ్లామన్నారు. అక్కడకు చేరుకున్న నాయకులు చెప్పినా తమను విడిచి పెట్టలేదన్నారు. తమను బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి తమతో ఖాళీ పేపర్లపై సంతకాలు చేయించుకుని పంపించారన్నారు. ఒక వ్యాపారిని అమానుషంగా గొడ్డును బాదినట్లు బాది ఇంతటి అవమానానికి గురి చేసి, తీవ్ర దాడికి ఎస్ఐ పాల్పడటం దారుణమని ఆర్యవైశ్య సంఘం నాయకులు గునుపూడి మధు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. నేడు తలపెట్టిన ఆందోళన కార్యక్రమాన్ని ఎమ్మెల్యేపై నమ్మకంతో వాయిదా వేసుకున్నామని, ఎస్ఐని సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆర్యవైశ్య సంఘం, వ్యాపారుల ఆధ్వర్యంలో ఆందోళన చేయాల్సి వస్తుందని పలువురు సంఘం నాయకులు ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు తెలిపారు. ఈ సంఘటపై ఎమ్మెల్యే కందుల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజేష్ కుమార్‌ను వివరణ సంఘటన జరిగిన తీరుపై తాను జిల్లా ఎస్‌పికి పూర్తి నివేదిక ఇచ్చామన్నారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా తాము బాధ్యత వహిస్తామని తెలిపారన్నారు. అనంతరం ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ వ్యాపారిపై ఎస్ఐ దాడి ఘటన దురదృష్టకరమని దీనిని తీవ్రమైన ఘటనగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి, మార్కాపురం ఏఎంసి ఛైర్మన్లు సయ్యద్ ఇమాంసా, మాలపాటి వెంకటరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు గునుపూడి చెంచు సుబ్బారావు, గునుపూడి మధు, వేమాకృష్ణమూర్తి, పమిడిమర్రి తిరుపాలు, మాగులూరి రామయ్య, శివాలయం ఛైర్మన్ ఒగ్గు వెంకటరామయ్య, టిడిపి నాయకులు ఆవులూరి యలమంద, వరికుంట్ల అనిల్, ముల్లా ఖుర్దూస్, దోర్నాల అంజిరెడ్డి, సామి రాజా, టిడిపి, ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్గొన్నారు.

# విద్యుత్ షాక్‌తో యువకుడు మృతి

**ప్రజాశక్తి-కొమరోలు**

కొమరోలు మండలం పొట్టిపల్లి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. పొలానికి వెళ్లిన గుమ్మళ్ల నాగరాజు (28) విద్యుత్ షాక్ గురై మృతి చెందిన సంఘటన వెలుగులోకి వచ్చినది. పొట్టిపల్లె గ్రామ సమీప పొలాలలో జరిగింది. కొమరోలు ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల మేరకు.. పొట్టిపల్లె గ్రామానికి చెందిన గుమ్మళ్ల నాగరాజు అనే యువకుడు గ్రామానికి వెలుపల ఉన్న పొలాలలో కొంత పొలం కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగు చేశాడు. విద్యుత్ మోటార్‌ను అమర్చిన స్టార్టర్ వద్ద నాగరాజు రాత్రి వేళల్లో అడవి జంతువుల రాకను గమనించేందుకు ఒక బల్బు ఏర్పాటు చేశాడు. అయితే రాత్రి పొలానికి కాపలాగా వెళ్లిన నాగరాజు విద్యుత్ బల్బు వెలగకపోవడాన్ని గమనించి దానిని సరిదిద్దేందుకు ప్రయత్నిస్తుండగా స్టార్టర్‌కు సంబంధించిన ఒక విద్యుత్ తీగ స్టార్టర్ నుంచి విడిపోయి ఉండటాన్ని నాగరాజు గమనించలేదు. సదరు విద్యుత్ తీగ నాగరాజు కాలుకు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. ఉదయం నాగరాజు ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని కోసం పొలం వద్దకు వెళ్లిన తల్లిదండ్రులకు నాగరాజు మృతి చెంది ఉండటాన్ని గమనించారు. నాగరాజు మృతితో అతని కుటుంబంలో గ్రామంలో విషాదఛాయలు అలుము కున్నాయి. నాగరాజు గత ఏడాది వివాహం కాగా ఒక కూతురు ఉన్నట్లుగా గ్రామస్తులు తెలిపారు. నాగరాజు తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నాగరాజు తెలిపారు.

# ఫ్లెక్సీల రగడ

## నిరుగప్పిన నిప్పులా 'రాయవరం'

**ప్రజాశక్తి-మార్కాపురం**

మండలంలోని రాయవరం గ్రామంలో ప్రస్తుతం ఫ్లెక్సీల గొడవలు రాజుకుంటున్నాయి. ఈ గ్రామ పంచాయతీలో టిడిపి, వైసిపి ప్రధాన రాజకీయ పార్టీలుగా ఉన్నాయి. అక్కడ ఆయా పార్టీల బలాబలాలు సరిదీటుగా ఉన్నాయి. ఈ నెల 21వ తేదీన మాజీ సిఎం వైఎస్ జగన్ పుట్టిన రోజు సందర్భంగా పలు ఫ్లెక్సీలను శుభాకాంక్షలు తెలుపుతూ వైసిపి కార్యకర్తలు ఏర్పాటు చేశారు. ఆ ఫ్లెక్సీలను రాత్రివేళల్లో ఎవరో చించివేశారు. వైసిపి శ్రేణులు అప్పటికప్పుడు మరోసారి ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటినీ చింపేశారు. నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా ఏర్పాటు చేస్తున్న ఫ్లెక్సీలను సైతం చింపుతున్నారు. ఇదంతా టిడిపి కార్యకర్తల పనేనని వైసిపి ఆరోపణలు చేస్తోంది. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడుతున్నారనే విషయం కూడా వైసిపి నేతలు తెలుసుకున్నట్లు సమాచారం. అధికారంలో ఉన్న టిడిపి కార్యకర్తలు మాత్రం చింపడమే పనిగా పెట్టుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఎలాంటి గొడవలు జరుగుతాయోనని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు ఆ గ్రామానికి చెందిన వైసిపి ఎంపిటిసి-1 పల్లెబోయిన వెంకట సుబ్బమ్మ, మాజీ సర్పంచి టి అడివయ్య, వైసిపి నాయకులు దేవండ్ల పెద్ద మల్లయ్య, ఎస్ వెంకటరెడ్డి తదితరులు మార్కాపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. చిల్లర పనులతో వివాదాలకు కారణమవుతున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించండి

**ప్రజాశక్తి-పొదిలి**

నిరుద్యోగులకు వెంటనే ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలని, లేదంటే నిరుద్యోగ భృతి ఇవ్వాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్ కరుణానిధి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో పొదిలి పట్టణంలో భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద జరిగిన కార్యక్రమంలో కరుణానిధి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని కోరారు. జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ యువతకు రూ.3,000 నిరుద్యోగ భృతి వెంటనే చెల్లించాలని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 19 నెలలు గడుస్తున్నా ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో విఫలం చెందిందన్నారు. యువతరం ఆగ్రహం చెందితే మీ ప్రభుత్వాలు కూలిపోతాయని, బంగ్లాదేశ్, ఇతర దేశాలను గుర్తు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గోపి, సన్నీ, అశోక్, స్టీఫెన్, ఫణీంద్ర, రవీంద్రారెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పేదల కడుపుకొట్టేందుకే 'ఉపాధి' చట్ట సవరణ

### రౌండ్ టేబుల్ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య

**ప్రజాశక్తి - బాపట్ల**

విబిజి రాంజీ ఉపాధి చట్టాన్ని రద్దు చేసి మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్ గంగయ్య డిమాండ్ చేశారు. స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం సిపిఎం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు టి కృష్ణమోహన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగయ్య మాట్లాడుతూ పని హక్కును కాలరాసి, గాంధీ పేరును తొలగించి జీ రాం జీ పేరుతో తెచ్చిన ఉపాధి కొత్త చట్టం రద్దు చేయాలని కోరారు. 2005 చట్టాన్ని బలోపేతం చేసి అమలు చేయాలని అన్నారు. గత రెండు దశాబ్దాలుగా వ్యవసాయ కార్మికులకే కాకుండా సన్న, చిన్న రైతులకు అన్నం పెట్టిన లక్షలాది ఎకరాల పేదల భూమిని అభివృద్ధి చేసిన ఉపాధి పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు మానుకోవాలని కేంద్రప్రభుత్వానికి సూచించారు. జాతిపిత మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎన్‌డిఎ ప్రభుత్వం రద్దు చేయడం అత్యంత దారుణమని అన్నారు. గుండెకాయ లాంటి హక్కును కాలరాశి మొండెం లేని తలలా జీ రాం జీ పేరుతో కొత్త చట్టాన్ని తెచ్చి కోట్ల మంది పేదలకు బిజెపి తీవ్రమైన ద్రోహం చేసిందని అన్నారు. ఈ చట్టానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం, వైసీపీ ఎంపీలు అందరూ ఒకటై పేదలకు వెన్నుపోటు పొడిచారని అన్నారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి గాంధీని చంపిన గాడ్సే పేరు వచ్చేలా జీ రామ్ జీ అని మార్చారని అన్నారు. సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు మేకల ప్రసాద్ మాట్లాడారు. సమావేశంలో ఆప్ నాయకులు ఆట్ల బాలాజీరెడ్డి, కాంగ్రెస్ నాయకులు రవి, వృత్తి దారుల సంఘ జిల్లా కన్వీనర్ పి కొండయ్య, ఐద్వా జిల్లా కార్యదర్శి టి సుభాషిణి, సిపిఎం నాయకులు నూతలపాటి కోటేశ్వరావు, కె నాగేశ్వరావు పాల్గొన్నారు.

**చీరాల :** ఉపాధి హామీ చట్టం స్ఫూర్తిని దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న మార్పులు వెంటనే వెనక్కి తీసుకోవాలని సీపీఎం కార్యదర్శి ఎన్ బాబురావు డిమాండ్ చేశారు. స్థానిక సీనియర్ సిటిజెన్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధిని హక్కుగా కాకుండా ప్రభుత్వ దయపై ఆధారపడే పథకంగా మార్చే ప్రయత్నం జరుగుతోందని విమర్శించారు. సమావేశంలో గోసాల ఆశీర్వదం, కొత్తపేట మాజీ సర్పంచి చుండూరు వాసు, ఊటుకూరు వెంకటేశ్వర్లు, బత్తుల శ్యామ్యూల్, దాసరి ఇమ్మానియేల్, శీలం వెంకటేశ్వర్లు, సవనం శామ్యూల్, ఐవి ప్రసాద్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సిపిఎం కార్యదర్శి ఎన్ బాబురావు


నాగుల చెరువు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

## వెనుకబడిన ప్రాంత అభివృద్ధే లక్ష్యం

**ప్రజాశక్తి - కనిగిరి**

వెనుకబడిన కనిగిరి ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. పట్టణంలోని నాజ్ సెంటర్లో నిర్మిస్తున్న విజయ మార్తాండేశ్వర ఆలయ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణ పనులు పరిశీలించారు. సైడ్ కాలువ నిర్మించాల్సిన ఆవశ్యకత చర్చించారు. 16, 5వ వార్డుల్లో పర్యటించారు. సైడ్ కాలువల నిర్మాణానికి పరిశీలించారు. పట్టణంలోని నాగుల చెరువు పరిశీలించారు. చెరువు కట్ట వాకింగ్ ట్రాక్‌గా మార్చేందుకు అధికారులతో చర్చించారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు షేక్ ఫిరోజ్, యూత్ అధ్యక్షులు అచ్చాల రవి, పిఎసిఎస్ అధ్యక్షులు అద్దంకి రంగబాబు, 5వ వార్డు టిడిపి అధ్యక్షులు బి రామసుబ్బారెడ్డి, బాలు ఓబులురెడ్డి, గంగవరపు నాగిరెడ్డి, కొలిపర్తి మారుతి, కొల్లూరి శ్రీనివాసులు, సద్గురు, జిలాని, అంజి నాయుడు, ఏనుగు శ్రీనివాసులు, కె సతీష్, బుల్ల బాలబాబు పాల్గొన్నారు.


క్యాన్సర్ అవగాహన కల్పిస్తున్న డాక్టర్ డి నిరుపమ

## గర్భాశయ కేన్సర్ పట్ల అవగాహన

**ప్రజాశక్తి - పర్చూరు**

బాలికలు గర్భాశయ క్యాన్సర్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ గైనకాలజి డాక్టర్ డి నిరుపమ తెలిపారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక శాతవాహన, ఆక్స్‌ఫర్డ్ ఉన్నత పాఠశాల 9 నుండి 14 ఏళ్ల బాలికలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. గర్భాశయ క్యాన్సర్ నివారణకు వ్యాక్సినేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఈ వ్యాక్సిన్ 4రకాల క్యాన్సర్లకు ఉపయోగమని తెలిపారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ మాట్లాడుతూ రోటరీ ఆధ్వర్యంలో 500 మంది విద్యార్థినిలకు త్వరలో ఉచితంగా వ్యాక్సిన్ వేయనున్నట్లు చెప్పారు. అసిస్టెంట్ గవర్నర్ నగభైరు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ వ్యాక్సిన్ రు.8వేలు ఉంటుందని, రోటరీ ద్వారా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. పాబోలు ఉదయ భాస్కర్, కార్యదర్శి కోమటి ఆంజనేయులు, పాబోలు చంద్రశేఖరరావు పాల్గొన్నారు.


వధూవరులను ఆశీర్వదిస్తున్న ఆనందబాబు

## వధూవరులకు ఆనందబాబు ఆశీర్వాదం

**ప్రజాశక్తి - వేమూరు**

వేమూరు గ్రామానికి చెందిన ఎలిచర్ల ప్రతాప్ (ఇస్సాకు) కుమారుని వివాహ వేడుక స్థానిక ఎఇఎల్‌సి చర్చ్ ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు హాజరై నూతన వధువు, వరులను ఆశీర్వదించారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాశక్తి - కనిగిరి**

పట్టణంలో విద్యుత్ లైన్ మరమ్మత్తుల కారణంగా 3వ ఫీడర్‌లో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ పవన్ కుమార్ తెలిపారు. ఉదయం 7నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

## సిఐటియు మహాసభలు జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

విశాఖపట్నంలో ఈనెల 31 నుండి జనవరి 4 వరకు జరుగుతున్న సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుందార్ కోరారు. మహాసభల ప్రచార జాతాకు కార్మికులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. ఎర్ర జండాలతో సెంటర్ ఎరుపు రంగుగా మారింది. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందార్, పి మనోజ్ కుమార్, జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్, కె ఝాన్సీ, నిర్మల, రమాదేవి, సీతా మహాలక్ష్మి, చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గోళ్ళ నాగరాజు పాల్గొన్నారు.

**నిజాంపట్నం :** సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్ కోరారు. సిఐటియు జాత బృందానికి కార్మికులు స్వాగతం పలికారు. జాతలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజంధార్, చిన్ను ప్రహ్లాదుడు, విఆర్ఎ సంఘం జిల్లా అధ్యక్షులు ఎం రత్నరాజు, వై మేరీమణి, ఎం ఉష పాల్గొన్నారు.

**నగరం :** సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని చేపట్టిన సిఐటియు ప్రచార జాతాకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజందార్ మాట్లాడారు. సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్, కె రత్నకుమారి, డి సునంద, జి మరియదాసు, ఎం చందర్రావు పాల్గొన్నారు.

**రేపల్లె :** సిఐటియు ప్రచార జాత బృందానికి స్వాగతం పలికారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజందార్ మాట్లాడారు. మహాసభల ముగింపురోజు జనవరి 4న జరిగే బహిరంగ సభకు కార్మికులు, ప్రజలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మణిలాల్, కె ఝాన్సీ, బి సురేష్, డి ప్రభాకరరావు, జె ధర్మరాజు, సాగర్, పి విజయ్ పాల్గొన్నారు.

**వేమూరు :** సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని కోరుతూ చేపట్టిన ప్రచార జాతకు కార్మికులు ఘన స్వాగతం పలికారు. జనవరి 4న విశాఖపట్నంలో జరిగే బహిరంగ సభకు కార్మికులు తరలి రావాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కె ఝాన్సీ కోరారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ మజుశీధార్, సిహెచ్ మణిలాల్, పి మనోజ్, బి అగస్టీన్, వేమూరు విజయరావు, ఎం నాగేశ్వరావు, అమల పాల్గొన్నారు.

**సిఎస్‌పురం రూరల్ :** సిఐటియు 18వ జాతీయ మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య కోరారు. కార్యక్రమంలో సిఐటియు కన్వీనర్ ఊసా రాజ్యలక్ష్మి, బిజీ రాజు (బత్తుల జ్ఞానరాజు), శ్రీనివాసులురెడ్డి, పోలయ్య, అంకమ్మరావు, వేల్పుల శ్రీను, శ్రీను పాల్గొన్నారు.

**కొల్లూరు :** సిఐటియు మహాసభల ప్రచార జాతాకు పంచాయతీ, ఆటో కార్మికులు బస్టాండు సెంటర్ దగ్గర ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి సిహెచ్ మనీలాల్ మాట్లాడారు. మహాసభలకు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు చొప్పర శ్రీనివాసరావు, బొనిగల సుబ్బారావు, రామకృష్ణ, భూషణం, చెంచారావు, ఆదిలక్ష్మి, జ్యోతి, సుబ్బమ్మ, విజయ పాల్గొన్నారు.

**కనిగిరి :** విశాఖపట్నంలో ఈనెల 31నుండి జనవరి 4వరకు జరిగే సిఐటియు అఖిల భారత మహాసభలు జయప్రదం చేయాలని సిఐటియు పట్టణ కన్వీనర్ పి నరేంద్ర కోరారు. పట్టణంలో మహాసభల కరపత్రాలు పంపిణీ చేశారు.

**బాపట్ల :** సిఐటియు అఖిల భారత మహాసభల సందర్భంగా చేపట్టిన ప్రచార జాతాలో సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ మజుందార్ మాట్లాడారు. సిఐటియు పట్టణ నాయకులు కె శరత్, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, రామకృష్ణ, బ్రహ్మం, నాగరాజు, అంజి పాల్గొన్నారు.



రేపల్లెలో మాట్లాడుతున్న సిహెచ్ మణిలాల్



బాపట్లలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి మజుందార్



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

## ఉపాధి హామీతో ప్రగతి పథంలో పల్లెలు

**ప్రజాశక్తి - బాపట్ల**

ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో రోడ్లు, పంచాయతీ కార్యాలయ భవనాల నిర్మాణాలతో పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తున్నాయని పార్లమెంట్ సభ్యులు తెన్నేటి కృష్ణ ప్రసాద్ అన్నారు. మండలంలోని తూర్పు పిన్నిబోయిన వారిపాలెంలో ఎన్ఆర్ఈజిఎస్ పథకం నిధులతో పంచాయతీ కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మతో కలిసి శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. మండలంలో ముత్తాయపాలెంలో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మించే రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి నామన వెంకట శివన్నారాయణ, బాపట్ల ఎఎంసి చైర్మన్ కావూరి శ్రీనివాసరెడ్డి, టిడిపి మండలం అధ్యక్షుడు ముక్కామల సాంబశివరావు, నరసింహారావు, మునేస్వరావు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన ప్రకాశం జిల్లా జట్టు క్రీడాకారులు

## మహిళా ఖోఖో విజేత ప్రకాశం జట్టు

**ప్రజాశక్తి - కనిగిరి**

కృష్ణా జిల్లా గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో ఈ నెల 24 నుంచి 26 వరకు నిర్వహించిన 58వ రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల ఖోఖో పోటీల్లో మహిళా జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలిచారు. ఈ విజయంతో వరుసగా మూడో ఏడాది రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌గా నిలవడం విశేషం. లీగ్ దశల్లో చిత్తూరు, విశాఖపట్నం జిల్లా జట్లపై విజయం సాధించిన ప్రకాశం జట్టు క్వార్టర్ ఫైనల్లో నెల్లూరు జట్టుపై గెలిచి సెమీ ఫైనల్‌కు చేరింది. తూర్పు గోదావరి జట్టును ఓడించి ఫైనల్‌కు ప్రవేశించింది. కృష్ణా జట్టుపై విజయం సాధించింది. క్రీడాకారులను గుడివాడ శాసన సభ్యులు వెనిగండ్ల రాము, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఖోఖో సంఘ రాష్ట్ర కార్యదర్శి కె హనుమంతరావు, ఖోఖో సంఘ జాతీయ ఉపాధ్యక్షులు మేకల సీతారామిరెడ్డి అభినందించారు. ఇచ్చిన కోచ్ భవనం కాశీ విశ్వనాథరెడ్డి, మేనేజర్లు ఈ జ్యోతి, పి సావిత్రిని అభినందించారు.

# శ్మశానం ఆక్రమణదారుడిపై చర్యలు తీసుకోవాలి

## ప్రభుత్వ కార్యాలయాల ఎదుట నాయుడుపల్లె కాలనీవాసుల ధర్నా

**ప్రజాశక్తి-తర్లుపాడు**

తర్లుపాడు-మార్కాపురం రహదారిలోని శ్మశాన భూమిని కబ్జా చేసి సమాధులను ధ్వంసం చేసిన వారిపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదంటూ నాయుడుపల్లె కాలనీ వాసులు స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద, తహశీల్దార్ కార్యాలయం వద్ద మండల రైతు సంఘం నాయకులు ఏరువ పాపిరెడ్డి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా యేరువ పాపిరెడ్డి మాట్లాడుతూ గత 15 రోజుల క్రితం శ్మశానాన్ని ప్రభుత్వ ఉపాధ్యాయుడు బండారు నాగరాజు జెసిబితో చదును చేసి, శ్మశానంలో ఉన్న సమాధులను కూడా ధ్వంసం చేశాడు. ఇదేమిటని ప్రశ్నించిన నాయుడుపల్లి కాలనీవాసులపై దౌర్జన్యానికి పాల్పడ్డాడు. అప్పట్లో కాలనీవాసులు ధర్నాలకు దిగడంతో రెవెన్యూ అధికారులు స్పందించి 82/1లో ఎ.1.76 సెంట్ల భూమి ప్రభుత్వ భూమిగా గుర్తించి హెచ్చరిక బోర్డు మాత్రమే పెట్టారు. పూర్వం నుంచి నాయుడుపల్లె కాలనీవాసులు ఈ భూమిని శ్మశాన భూమిగా ఉపయోగించుకుంటున్నారు. అయితే ఈ భూమిపై కన్నేసిన ఉపాధ్యాయుడు నాగరాజు కబ్జా చేసి సమాధులను ధ్వంసం చేశాడు. ఈ ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు కూడా వెనుకంజ వేయటం ఏమిటంటూ పాపిరెడ్డి ప్రశ్నించారు. అప్పట్లో క్రిమినల్ కేసు నమోదు చేయిస్తానని, ఆక్రమణ దారుడుపై చర్యలు తీసుకోకపోవడంపై ఆంతర్యం ఏమిటంటూ నిలదీస్తున్నాడు. బండారు నాగరాజు వద్ద కొందరు రెవెన్యూ అధికారులు భారీ మొత్తంలో ముడుపులు తీసుకోవడం వల్లనే చర్యలకు వెనకాడుతున్నట్లు ఆయన విమర్శించారు. లేదా ఆయనకు అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతోనే, శ్మశాన భూమిని కబ్జా చేసేందుకు ప్రయత్నించినప్పటికీ చర్యలు తీసుకోలేదా అంటూ ప్రశ్నించారు. స్వయానా కాలనీవాసులు తర్లుపాడు పోలీస్ స్టేషన్లో బండారు నాగరాజుపై ఫిర్యాదు చేసినప్పటికీ నేటి వరకు కేసు నమోదు చేయకపోవడం లోని ఆంతర్య మేమిటో అర్థం కావట్లేదు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి తర్లుపాడులోని శ్మశానాన్ని కబ్జా చేసిన ఆక్రమణదారుడిపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని రైతు సంఘం నాయకులు, కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.


ఏవోకు వినతిపత్రం అందజేస్తున్న యేరువ పాపిరెడ్డి, కాలనీవాసులు

**శ్మశానాన్ని కబ్జా చేసింది ఒక ఉపాధ్యాయుడే..**

విద్యార్థులకు విద్యా బోధన చేయవలసిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు బండారు నాగరాజు బరితెగించి, ఇష్టారాజ్యంగా శ్మశానాలను కూడా వదలకుండా ఆక్రమించుకుంటున్నాడు. విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దవలసిన ఉపాధ్యాయుడు శ్మశానాన్ని కబ్జా చేసి, అందులోని సమాధులను కూడా కూల్చేసి, తప్పైపోయిందిలే అనడం అతని బాధ్యతా రాహిత్యానికి ఇదే నిదర్శనం. ఈ ఉపాధ్యాయుడిపై జిల్లా విద్యాశాఖ అధికారులు విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

## ప్రజాశక్తి క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-తర్లుపాడు**

ప్రజాశక్తి-2026 నూతన క్యాలెండర్‌ను శనిఆరం మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి గొల్లపల్లి గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కందుల మాట్లాడుతూ ప్రజాశక్తి రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఎంతో ఆకర్షణీయంగా ఉందని ప్రశంసించారు. ప్రజాశక్తి పత్రిక ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం వార్త కథనాలు రాస్తోందని అన్నారు. ఈ ఆవిష్కరణ కార్యక్రమంలో మార్కాపురం డివిజన్ ఇన్‌ఛార్జి వీరారెడ్డి, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఉడుముల చిన్నపరెడ్డి, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చనూతల గోపీనాథ్ చౌదరి, ఒంగోలు టిడిపి పార్లమెంటు ఉపాధ్యక్షులు కంచర్ల కాశయ్య, తదితరులు పాల్గొన్నారు.


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కందుల నారాయణరెడ్డి, టిడిపి నాయకులు

## సోషల్ మీడియా సభ్యులకు దుస్తులు పంపిణీ

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని ఐదు మండలాల సోషల్ మీడియా టీమ్ సభ్యులకు నూతన సంవత్సరం సందర్భంగా నియోజకవర్గ శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ శనివారం బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ బలోపేతంలో సోషల్ మీడియా కార్యకర్తల పాత్ర అత్యంత కీలకమైనదని చెప్పారు. ప్రతికూల పరిస్థితులు, అబద్ధపు ప్రచారాలు ఎదురైనా నిజాన్ని ధైర్యంగా ప్రజల ముందుకు తీసుకెళ్తున్న సోషల్ మీడియా సైనికుల సేవలు మరువలేనివని అన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంటా వెంకట రమణారెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు శ్యామ్, యర్రగొండపాలెం మండలం సోషల్ మీడియా అధ్యక్షుడు కొమ్ము రవి, పుల్లలచెరువు మండల సోషల్ మీడియా అధ్యక్షుడు లింగంగుంట్ల భాస్కర్, దోర్నాల మండల సోషల్ మీడియా అధ్యక్షుడు వెన్నా బ్రహ్మానందరెడ్డి, పెద్దారవీడు మండల సోషల్ మీడియా అధ్యక్షుడు శొంఠి నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పీడీ యాక్ట్‌తో ప్రజా ఉద్యమాలను అణచివేయలేరు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

ప్రజా సమస్యలపై జరుగుతున్న ఉద్యమాలను అణచివేయడానికి పీడీ యాక్ట్‌ను ప్రయోగించడం ప్రభుత్వ నిరంకుశ ధోరణికి నిదర్శనమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు విమర్శించారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు జయంతిబాబు, జిల్లా కార్యదర్శి పమిడి వెంకటరావు శనివారం మీడియాతో మాట్లాడారు. నక్కపల్లి ప్రాంతంలో అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి ఎం అప్పల రాజుపై పీడీ యాక్ట్ పెట్టి జైలుకు తరలించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.

## గాంధీ పేరు తొలగించడం సిగ్గుచేటు

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

పథకాల పేర్లు, సంస్థల పేర్లు, నగరాల పేర్లు మార్చినంత మాత్రాన ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించలేమని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ మైనారిటీ విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఖాసీంసా అన్నారు. శనివారం యర్రగొండపాలెంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకానికి జాతిపిత మహాత్మాగాంధీ పేరును తొలగించడం బాధాకరమన్నారు.

## విశ్రాంత ఉపాధ్యాయుడు మృతి

**ప్రజాశక్తి-కొమరోలు**

కొమరోలుకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు (వాస్తు నారాయణ) మానుకొండు నారాయణ(69) అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మానుకొండు నారాయణ అనేక ప్రాథమిక ప్రాథమికోన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఎంతోమంది విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దారు. నారాయణ రాజుపాలెంలోని జిల్లా పరిషత్ హైస్కూల్‌లో బయాలజికల్ సైన్సు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ గత ఎనిమిదేళ్ల క్రితం ఉద్యోగ విరమణ చేశారు. ఆయన ఉపాధ్యాయునిగా పనిచేస్తూనే వాస్తు శాస్త్రంలో ప్రావీణ్యం పొంది అనేకమందికి ఉచితంగా గృహాలకు వాస్తు చెబుతూ మంచి పేరు ప్రఖ్యాతులు సాధించారు. దీనితో నారాయణ వాస్తు నారాయణగా పేరు పొందారు. కొమరోలు మండలంతో పాటు ఇతర మండలాల్లో కూడా ఆయనకు మంచి పేరు ప్రఖ్యాతులు ఉన్నాయి. కులం, మత, ధనిక, పేద అనే తేడా లేకుండా ఎవరు పిలిచినా వాళ్ల ఇళ్లకు వెళ్లి వాస్తు చెప్పేవారు. గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న నారాయణను కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఆసుపత్రిలో చికిత్స కోసం అక్కడ చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించడంతో మృతి చెందారు. ఆయన భౌతిక కాయాన్ని ఉదయం కొమరోలులోని ఆయన స్వగృహానికి చేర్చారు.

ఆయన మరణ వార్త తెలుసుకున్న వందలాదిమంది బంధుమిత్రులు, విద్యార్థులు, సాధారణ ప్రజలు సైతం నారాయణ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. కొందరు కన్నీటి పర్యంతమయ్యారు. వాస్తు నారాయణ కుటుంబ సభ్యులు బంధుమిత్రుల కన్నీటి వీడ్కోలుతో అంత్యక్రియలు నిర్వహించారు. వాస్తు నారాయణకు భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

## సిఎ విద్యార్థినికి ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-పొదిలి**



విద్యార్థినికి ఆర్థిక సాయం చేస్తున్న దృశ్యం

పొదిలి ఆర్టీసీ డిపోలో స్వీపర్‌గా విధులు నిర్వహిస్తున్న కోవెలకుంట్ల చెన్నమ్మ కుమార్తె అపర్ణ ఇటీవల సిఎ ఎగ్జామ్స్‌లో బెంగళూరులో చార్టెడ్ అకౌంట్‌లో ఉచిత సీటు సాధించింది. పేదరికంతో ఇబ్బందిపడుతూ కుటుంబాన్ని నెట్టుకువస్తున్న తల్లి పొదిలి డిపోలో స్వీపర్‌గా పని చేస్తోంది. తల్లి అనేక అవస్థలు పడుతున్న సమయంలో తన కూతురు కోవెలకుంట్ల అపర్ణకు బెంగళూరులో చార్టెడ్ అకౌంట్ కోర్సులో ఉచిత సీటు రావడంతో బాలిక చదువు కోసం డిపో మేనేజర్ శంకర్రావు సూచనల మేరకు ఉద్యోగులు, సిబ్బంది కొందరు ఆర్థిక సహాయం చేశారు. మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులు శుక్రవారం స్థానిక బస్టాండ్‌లో విద్యార్థినికి నగదు సహాయం అందించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు ముల్లా షరీఫ్, ఆర్టీసీ టిఐ-3లు సుబ్బయ్య, రమేష్, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకులు కళ్లం సుబ్బారెడ్డి, జి శ్రీను, మువ్వల పార్థ సారథి, భవాని శ్రీను పాల్గొనగా, ఆర్థిక సహాయం చేసిన పొదిలి వ్యవసాయ మార్కెట్ చైర్మన్ డాక్టర్ సయ్యద్ ఇమాంసా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టీఎన్ఎస్ఎఫ్ ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ కుమార్ తదితరులు ఉన్నారు. తన కూతురిని గుర్తించి తన కష్టం విలువ తెలుసుకొని ఆర్థిక సహాయం చేసిన ప్రతి ఒక్కరికి అపర్ణ తల్లి చెన్నమ్మ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గిద్దలూరు టెన్నిస్ క్రీడాకారుల ముందంజ

**ప్రజాశక్తి-గిద్దలూరు**

హిందూపూర్‌లో జరుగుతున్న ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్ర స్థాయి 55 ప్లస్ మెన్ డబుల్స్‌లో రాము నరసరావుపేట మరియు సుధా హైదరాబాద్‌పై టపా వలి గిద్దలూరు అండ్ రమేష్ మార్కాపురం వారు 2-7 స్కోర్‌తో విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించారు. అలాగే 65 ప్లస్ మెన్ డబుల్స్‌లో రసూల్ నరసరావుపేట అండ్ దేవా హిందూపూర్‌పై కోటయ్య గౌడ్ గిద్దలూరు అండ్ ఐసయ్య పులివెందుల వారు 1-7స్కోర్ తో విజయం సాధించి ప్రీ క్వార్టర్ ఫైనల్‌లోకి ప్రవేశించారు. హిందూపూర్ టెన్నిస్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన గిద్దలూరు క్రీడాకారులైన టపా వలి, కోటయ్య గౌడ్ లను ప్రకాశం జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులైన డాక్టర్ జికె మోహన్ రెడ్డి, సెక్రటరీ షేక్ బాషా, ట్రెజరర్ రంగయ్య, టెన్నిస్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**ప్రజాశక్తి-యర్రగొండపాలెం**

యర్రగొండపాలెం పట్టణంలోని 132/33 కేవీ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల పనులు చేపట్టనున్న నేపథ్యంలో ఆదివారం యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ శాఖ ఇన్‌చార్జి ఏఈ పిల్లి కిశోర్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల, వీరభద్రాపురం, వెంకటాద్రిపాలెం, గంజివారిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం ఉదయం 7.30 గంటల నుంచి 11.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1.30 గంటల వరకు యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం మండలాల్లోని అన్ని గ్రామాలకు పూర్తిగా విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పుల్లలచెరువు మండలంలో 33 కేవీ చాపలమడుగు లైన్‌పై ఉన్న కవలకుంట్ల, మర్రివేముల సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు మధ్యాహ్నం 1.30 గంటల నుంచి 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని చెప్పారు. విద్యుత్ సబ్‌స్టేషన్‌లో చేపట్టే మరమ్మతులు పూర్తయిన వెంటనే సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు.

## సిఐటియు మహాసభలు జయప్రదం చేయండి

**ప్రజాశక్తి-గిద్దలూరు**

సిఐటియు అఖిల భారత 18వ మహాసభలు జయప్రదం చేయాలని పట్టణంలోని పలు కార్మిక అడ్డాల దగ్గర జీపు జాతాతో ప్రచారం సాగింది. ఈ జాతాలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ పాల్గొని మాట్లాడుతూ కార్మికులు హక్కుల సాధనకు కార్మిక వర్గం ఐక్యం కావాలని అన్నారు. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 29 కార్మిక చట్టాలను, నాలుగు లేబర్ కోడ్‌లుగా అమలు చేయడాన్ని వ్యతిరేకించాలని అన్నారు. అలాగే విశాఖపట్నం ఈ నెల 31వ తేదీ నుంచి జనవరి 4 వరకు జరుగు సిఐటియు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. జనవరి 4వ తేదీ విశాఖపట్నంలో జరిగే భారీ బహిరంగ సభ ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సిఐటియు జిల్లా కార్యదర్శి టి ఆవులయ్య, ఆర్ మాలకొండయ్య, మండల కన్వీనర్ బి నర్సింహులు, సిఐటియు నాయకులు జి ఆనంద్‌రావు, మురళి, పి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఎంఈఓ వెంకారెడ్డికి పితృ వియోగం

**ప్రజాశక్తి-సంతనూతలపాడు**


రామిరెడ్డికి బిఎన్ నివాళి

సంతనూతలపాడు మండల విద్యాశాఖ అధికారి డి వెంకారెడ్డికి పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి రామిరెడ్డి(87) శుక్రవారం రాత్రి వయోభారంతో కూడిన అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన మరణ వార్త తెలుసుకొని పలువురు శనివారం ఆయన మృత దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్ విజయ్ కుమార్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి అడకా స్వాములు, నాయకులు మద్దినేని హరిబాబు, బొడ్డపాటి చంద్రశేఖర్, రావుల సుబ్బారావు, డివైఇఓ చంద్రమౌళీశ్వర్, పలు మండలాల ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఎంఈఓ వెంకారెడ్డికి, కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు.



ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన కమిషనర్ డానియల్ జోసఫ్

## కమిషనర్ జోసఫ్ బాధ్యతల స్వీకరణ

**ప్రజాశక్తి - చీరాల**

మున్సిపల్ కమిషనర్‌గా డేనియల్ జోసఫ్ గురువారం అధికారికంగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కమిషనర్‌గా పనిచేస్తున్న అబ్దుల్ రషీద్ బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో డేనియల్ జోసఫ్‌ను ప్రభుత్వం నియమించింది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం శాసన సభ్యులు ఎంఎం కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కె సాంబ

## క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన

**ప్రజాశక్తి - వేటపాలెం**

స్థానిక సెయింట్ ఆన్స్ ఇంజనీరింగ్ కాలేజీలో సాఫ్ట్వేర్ ఇంజనీరింగ్ బియాండ్ ది క్లాస్ రూమ్ అనే అంశంపై అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఎఐఎంఎల్ విభాగం ఆధ్వర్యంలో ఫ్లిప్ కార్ట్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజీనీర్‌గా పనిచేస్తున్న కె సాంబ విచ్చేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కె జగదీష్ బాబు తెలిపారు. విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్ ప్రాముఖ్యత వివరించారు. రియల్ టైమ్ అప్లికేషన్స్ క్లౌడ్‌లో ఎలా నిర్వహించాలో తెలిపారు. ఎపిఐ కీస్ అవసరం, వివిధ అప్లికేషన్స్‌లో అనుసంధానం చేయటం వివరించారు. మెషీన్ లెర్నింగ్ రంగంలోని అవకాశాలు, పరిశ్రమల్లో వాటి వినియోగంపై అవగాహన కల్పించారు. తరగతి గదిలో నేర్చుకొనే సిద్ధాంత జ్ఞానానికి మించి సాఫ్ట్‌వేర్ ఇండస్ట్రీలో ఎలా ఎదగాలో తెలిపారు. విద్యార్థుల సందేహాలు నివృత్తి చేశారని ఎఐఎంఎల్ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్ హరికిషన్ తెలిపారు. కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ పిఎస్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.



పాఠశాలను పరిశీలిస్తున్న ఈదర హరిబాబు

## ఉపయోగపడే విద్యను అందించాలి

**ప్రజాశక్తి - సిఎస్ పురం**

పేద పిల్లలకు ఉపయోగపడే చదువు నేర్పించాలని జెడ్‌పి మాజీ చైర్మన్ ఈదర హరిబాబు తెలిపారు. మండలంలోని అంబవరం జెడ్‌పి హై స్కూలును ఆయన శనివారం సందర్శించారు. గణిత దినోత్సవం రోజున శ్రీనివాస రామానుజన్ డ్రాయింగ్ ఫోటో వేసిన 10వ తరగతి విద్యార్థి ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుల సమావేశం

**ప్రజాశక్తి - అద్దంకి**

స్థానిక షాదిఖానాలో ఆర్ఎంపి, పిఎంపి వైద్యుల డివిజన్ సమావేశం గుంటూరు ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ సౌజన్యంతో శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో వి సుబ్బారావు, ఎస్‌కె ఖాజావళి, చంద్రశేఖర్, లింగారావు, ఎస్‌కె కరీం, కె సైదావలి పాల్గొన్నారు.

# జాతీయస్థాయి యోగా పోటీలు ప్రారంభం

**ప్రజాశక్తి - బాపట్ల**

యోగాతో ఆరోగ్యకర మైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర వర్మ రాజు అన్నారు. మండలంలోని జిల్లెళ్ళమూడిలో 44వ జాతీయ స్థాయి యోగాసన ఛాంపియన్షిప్ పోటీలు విశ్వ జనని పరిషత్ ట్రస్ట్ ఆవరణలో కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్‌తో కలిసి ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యోగ విద్యలో ప్రపంచానికి మార్గదర్శిగా మనదేశం ఉందన్నారు. శాసన సభ్యుడిగా ప్రజలకు జవాబుదారీగా, బాధ్యతాయుతంగా, నిరంతరం అందుబాటులో ఉండేలా తన జీవన ప్రణాళిక కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలో యోగ అభ్యసనలో క్రమశిక్షణ లోపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. యోగా పోటీలకు బాపట్ల వేదిక కావడం తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. వివిధ రాష్ట్రాల నుండి బాపట్లకు తరలిరావడం జాతీయ స్థాయిలో బాపట్లకు ప్రత్యేక గుర్తింపు తెచ్చిందని అన్నారు. కార్యక్రమంలో ఇండియన్ యోగ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజి భూషణ్ పురోహిత్, ప్రధాన కార్యదర్శి మృణాల్ చక్రబోర్తి, స్టేట్ యోగ అసోసియేషన్ అధ్యక్షులు కూన కృష్ణదేవరాయలు, చైర్మన్ కళ్ళం హరినాదరెడ్డి, ప్రధాన కార్యదర్శి అల్లాడి రవికుమార్, విశ్వ జనని పరిషత్ గౌరవాధ్యక్షులు ఎం దినకర్, బి రవీంద్రబాబు, బుడా చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, నరేగా మాజీ కౌన్సిల్ సభ్యురాలు మొవ్వ లక్ష్మి సుభాషిని, వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, శీలం శ్రీనివాసరావు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, యార్లగడ్డ లక్ష్మీనారాయణ రెడ్డి నాగరాజు, ఇమ్మడిశెట్టి కోటేశ్వరరావు పాల్గొన్నారు.



యోగా పోటీలు ప్రారంభిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

# రోడ్లపై చెత్త వేస్తే కఠిన చర్యలు

**ప్రజాశక్తి - పామూరు**

పట్టణంలోని రోడ్లపై వ్యర్థాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ ఎం శ్రీనివాసురావు హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఆటో, టాక్సీ, క్యాబ్ ఆటో, జెసిపి, ట్రాక్టర్ డ్రైవర్ల అవగాహన సభ ఎఎస్ఐ జిలాని భాష అధ్యక్షతన శనివారం నిర్వహించారు. పట్టణంలోని చెరువు కట్ట వద్ద వ్యర్థాలు వేస్తున్నారని, రోడ్లపై తిను బండారాలు వేయడం వల్ల ప్రజలకు ఇబ్బందిగా ఉందని సూచించారు. పట్టణంలో ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో ఉండాలని అన్నారు. ఇంటిలో శుభ్రంగా ఉన్నట్లే రోడ్లపై ఉండాలని తహశీల్దారు వాసుదేవరావు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అరవిందరెడ్డి, టిడిపి మండల మాజీ అధ్యక్షులు పువ్వాడ వెంకటేశ్వర్లు, మెంట నరసింహారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ ఎం శ్రీనివాసరావు

# విశాలమైన రోడ్లు ఏర్పాటు చేయాలి

**ప్రజాశక్తి - పీసీపల్లి**

పెద అలవలపాడు నుండి పిసిపల్లి వరకు రూ.4 కోట్లతో నిర్మిస్తున్న తారు రోడ్డును విశాలంగా ఏర్పాటు చేయాలని టిడిపి నాయకులు కాంటాక్టర్ సుధాకర్‌తో మాట్లాడారు. స్థానిక బ్యాంక్ సెంటర్ వద్ద మలుపులో ఇరుకుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదని తెలిపారు. కొన్ని సార్లు ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ఒకేసారి రెండు ట్రాక్టర్లు ఎదురుగా వచ్చిన ఇబ్బందికరంగా ఉంటుంది. ఈ ప్రాంతంలో విశాలంగా సిమెంట్ రోడ్డు నిర్మించాలని కోరారు. కాంట్రాక్టర్‌తో కలిసి టిడిపి నాయకులు వేమూరి రామయ్య మాట్లాడుతూ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని రోడ్డు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇర్లపాడు వైపు నుండి వచ్చే వాహనాలు, అలవలపాడు వైపు నుండి వచ్చే వాహనాలు మూల మలుపు వద్దకు ఎదురెదురుగా వచ్చిన కనపడే విధంగా రోడ్లను ఏర్పాటు చేయాలని అన్నారు. గతంలో ఉన్న రోడ్డును వెడల్పు చేసి 40అడుగుల సిమెంట్ రోడ్ నిర్మించాలని కోరారు. కాంట్రాక్టర్ సుధాకర్ ప్రజలు కోరిన విధంగా ఏర్పాటు చేసేందుకు అంగీకరించారు. ఆయన వెంట పులి ప్రతాప్, మూలే సత్తిరెడ్డి, మూలే ఏడుకొండలు, హోటల్ చెన్నారెడ్డి, నలబోలు మహేంద్ర ఉన్నారు.



సమీక్ష చేస్తున్న డిపిఒ వెంకటేశ్వరరావు

## గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలి

**ప్రజాశక్తి - వెలిగండ్ల**

మండలంలోని గ్రామాలన్నీ పరిశుభ్రంగా ఉండాలని డిపిఒ వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రెడ్డిగారి గంగాధర్, డిప్యూటీ ఎంపిడిఒ జనార్ధనరాజు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. స్వామిత్వ, ఇంటి పన్ను వసూలు, క్లాప్ మిత్రాల రెమ్యూనరేషన్, గ్రామాల్లో క్లీన్ అండ్ గ్రీన్, 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం తదితర అంశాలపై సమీక్ష చేశారు. సమావేశంలో పంచాయతీ కార్యదర్శులు బి కొండయ్య, రెడ్డెం భాస్కరరెడ్డి, గిరిధర్, షేక్ రజియా, పద్మ, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, రాజశేఖర్ పాల్గొన్నారు.



సూచనలు ఇస్తున్న డిడిఓ కె శ్రీనివాసరెడ్డి

## సకాలంలో ఇంటి పన్నులు వసూలు చేయాలి

**ప్రజాశక్తి - కనిగిరి**

ఇంటి పన్ను వసూళ్ళు, స్వామిత్వ 3వ దశ సర్వే అమలుపై పట్టణంలోని డిడిఒ కార్యాలయంలో డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ కె శ్రీనివాసరెడ్డి గ్రామ అభివృద్ధి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇంటి పన్ను వసూళ్ల ప్రగతిని సమీక్షించారు. లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పనుల్లో జాప్యం లేకుండా సమన్వయంతో పనిచేయాలని చెప్పారు. గ్రామాల అభివృద్ధికి నిధులు సమకూర్చుకోవాలని అన్నారు. సకాలంలో పనులు నూరుశాతం వసూలు చేయాలన్నారు.



మాట్లాడుతున్న తహశీల్దారు శ్రీనివాసరావు

## రీ సర్వే విజయవంతం చేయాలి

**ప్రజాశక్తి - భట్టిప్రోలు**

రాష్ట్ర ప్రభుత్వం రీ సర్వే ప్రాజెక్టులో భాగంగా జనవరి 2 నుండి జరిగే 4వ విడత రీ సర్వే విజయవంతం చేయాలని తహశీల్దారు మేక శ్రీనివాసరావు కోరారు. మండలంలోని వెల్లటూరులో రీ సర్వే సందర్భంగా సర్పంచ్ బొజ్జ రవి అధ్యక్షతన శనివారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ పెద్దలు, రైతులు, ప్రజలతో ఆయన మాట్లాడారు. 4వ విడత రి సర్వే జరుగుతుందని తెలిపారు. సర్వే బృందాలు మీ పొలం వద్దకు వచ్చేటప్పుడు అందుబాటులో ఉండి భూమి హద్దులు చూపించుకుని సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిప్యూటీ తహశీల్దారు అనగాని శాంతలక్ష్మి, ప్రసన్న, వెల్లటూరు ఎంపీటీసీ వాక వెంకటనారాయణ, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోటూరు పుణ్య శ్రీనివాసరావు, కాట్రగడ్డ నాగమల్లేశ్వరరావు, విఆర్ఒ శివరామకృష్ణ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న దృశ్యం

## కూటమి పాలనలోనే గ్రామాభివృద్ధి

**ప్రజాశక్తి - సంతమాగులూరు**

టిడిపి కూటమి పాలనలోనే గ్రామాభివృద్ధి జరుగుతుందని మైనార్టీ సెల్ జిల్లా కార్యదర్శి బాజీ మసూద్ తెలిపారు. మండలంలోని కొమ్మాలపాడు సచివాలయం బజారులో రూ.20 లక్షలతో నిర్మించే సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో ఈఒ పిఆర్డి శివరాం ప్రసాద్, పిఆర్ డిఇ నాగేశ్వరరావు, చెన్నుపల్లి నాగూర్, మన్నేపల్లి ఖాదర్ మస్తాన్, చెన్నుపల్లి ఖాదర్ మస్తాన్ (కొండి) పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న రోటరీ ప్రతినిధులు

## రోటరీ ఆధ్వర్యంలో రక్తదానం

**ప్రజాశక్తి - అద్దంకి**

రక్త హీనతతో బాధ పడుచున్న నర్రావారి పాలెం నివాసి నర్రా సాంబశివరావు (48)కు అత్యవసరంగా బి రక్తం ఎక్కించాలని వైద్యులు సూచించడంతో రోటరీ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్, సింగరకొండ ప్రసన్నంజ నేయ స్వామి దేవస్థానం ఛైర్మెన్ చుండూరి మురళీ సుధాకరరావు తిమ్మాయపాలెంకు చెందిన చాగంటి శివప్రసాదును ప్రోత్సహించి రక్త దానం చేయించారు. కార్యక్రమంలో రోటరీ సెక్రటరీ అలహరి హరి ప్రసాద్, పూర్వ అధ్యక్షులు చప్పిడి వీరయ్య, గూడా లక్ష్మీరెడ్డి, మలాది శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## మందుబాబులకు జరిమానా

**ప్రజాశక్తి - అద్దంకి**

మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 8 మంది వాహనదారులను సిఐ సుబ్బరాజు శనివారం ఎజెఎఫ్‌సిఎం కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి బి అఖిల వాహనాలు నడిపిన ఒకరికి రూ.6వేలు, ఒకరికి రూ.5వేలు, ఒకరికి రూ.2వేలు, ఒకరికి రూ.వెయ్యి, ఒకరికి రూ.10 వేలు, ఒకరికి రూ.50 కలిపి మొత్తం రూ.24050 వేల అపరాధ రుసుం విధించారు. ఇద్దరు వాహనదారులకు 3 రోజులు జైలు శిక్ష విధించినట్లు తెలిపారు. ఇద్దరు శిక్ష విధించిన వాహనదారులను ఒంగోలు జైలుకు తరలించారు.

## ఆటపాటలతో కూడిన విద్య అవసరం

**ప్రజాశక్తి - సిఎస్ పురం**

పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అవసరమని సిడిపిఒ ఆశావేగం అన్నారు. స్థానిక అంగనవాడీ కేంద్రంలో ఈసిసిఇ డే నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్వైజర్ దేవకృపావరం పాల్గొన్నారు.

**సిఎస్‌పురం రూరల్ :** మండలంలోని ఆనికాలపల్లి అంగన్‌వాడి కేంద్రంలో ఈసీసీఇ కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం భారతి, ఆనికాలపల్లి, మునగల వారిపల్లి అంగన్‌వాడీ కార్యకర్తలు షేక్ షహనాజ్, షేక్ హసీనా, విజయలక్ష్మి పాల్గొన్నారు.

**అమృతలూరు :** అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈసిసిఈడే నిర్వహించాలని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ అధికారిని ఎ లక్ష్మీదేవి సూచించారు. మోపర్రు సెక్టార్ పరిధిలోని గోవాడలో నిర్వహించారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

## బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ర్యాలీ

**ప్రజాశక్తి - అమృతలూరు**

బాల్య వివాహాలు చట్టారీత్యా నేరమని, బాలికలకు 18ఏళ్ళు నిండిన తర్వాతనే వివాహాలు చేపట్టాలని సిడిపిఒ లక్ష్మీదేవి సూచించారు. మండూరు సెక్టార్ పరిధిలో బాల్య వివాహ రహిత ఆంధ్ర ప్రదేశ్ సాధించేందుకు చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు.

**కనిగిరి :** బాల్య వివాహాల నిర్మూలనకు 100 రోజుల ప్రచారంలో భాగంగా పట్టణంలోని పిఎంశ్రీ జెడ్‌పి బాలికల ఉన్నత పాఠశాల్లో మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి రూపశ్రీ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మున్సిపల్ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్, ఇంచార్జి హెచ్‌ఎం నాగపద్మజారాణి పాల్గొన్నారు.

**బల్లికురవ :** పాఠశాల స్థాయి నుండి విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని నరసరావుపేట జూనియర్ సివిల్ జడ్జి ఆశీర్వాదం పాల్, తిరువూరు న్యాయమూర్తి సింధూర అన్నారు. మండలంలోని మల్లాయపాలెం పాఠశాల్లో శనివారం జరిగిన సదస్సులో మాట్లాడారు. అట్లూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన కల్పించారు.

**పామూరు :** బాల్య వివాహాలు నిర్మూలించాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని కందులవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో వగ్గంపల్లి సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. తల్లి దండ్రులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలు వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు.

## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

**ప్రజాశక్తి - రేపల్లె**

మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌పిడి వెన్నెల సబ్ జైలును శనివారం సందర్శించారు. ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని చెప్పారు. క్షణకావేశానికిలోనై శిక్ష అనుభవిస్తున్న ఖైదీలు బయటికి వెళ్లిన తర్వాత నేరాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఖైదీల ఆహార సదుపాయాలు, గదులు, పరిసరాలు పరిశీలించారు. ఖైదీల కేసుల వివరాలు తెలుసుకొని వారికి గల న్యాయ సహాయం గురించి తెలిపారు. సబ్ జైల్ అధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిఐ రమణయ్య

## శక్తి యాప్‌లో ఫిర్యాదు చేయండి

**ప్రజాశక్తి - ఇంకొల్లు**

బాల్య వివాహాలు చేయటానికి ప్రయత్నించిన, ఏదైన ఇతర అత్యవసర సమయంలో శక్తి యాప్ ఉపయోగించి తక్షణ రక్షణ పొందవచ్చని సిఐ రమణయ్య అన్నారు. పూసపాడు డ్రీమ్స్ జూనియర్ కాలేజి విద్యార్థులకు శక్తి యాప్‌పై సిఐ రమణయ్య, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో అవగాహన నిర్వహిం చారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి తెలిపారు. సమస్య ఎదురైనప్పుడు 100, 112 నెంబర్లకు తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ కె సుబ్బారావు, కాలేజి చైర్మన్ రాధా కృష్ణ మూర్తి, కరస్పాండెంట్ పేర్ని సతీష్ చంద్ర, ప్రిన్సిపాల్ వంకాయలపాటి శ్రీను పాల్గొన్నారు.

# మొక్కుబడిగా మండల సమావేశం

**ప్రజాశక్తి - ముండ్లమూరు**



మాట్లాడుతున్న ఎంపిపి సుంకర సునీత

మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుంకర సునీత అధ్యక్షతన శని వారం నిర్వహించారు. సమావేశంలో ఎంపీపీ సునీత మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు సక్రమంగా చేయాలని అన్నారు. గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. మండలంలో 16 మంది ఎంపిటిసిలు ఉండగా ఎంపిపితో కలిపి 8మంది మాత్రమే హాజరయ్యారు. ప్రజా సమస్యలపై చర్చించి అధికారులతో పనులు చేయించాల్సిన ప్రజాప్రతినిధులు సంతకాలు చేసి సమావేశంలో లేకుండా తిరిగి వెళ్లటంపై విమర్శలు వస్తున్నాయి. 3నెలలకు ఒక సారి జరిగే సమావేశంలో అధికారులు చేసిన పనులు, చేయబోయే పనులు తెలుసుకొని, గ్రామాల్లో సమస్యలు అధికారుల దృష్టికి తీసుకు వెళ్లవలసిన ప్రజాప్రతినిధులు సంతకాలకే పరిమితం అయ్యారు. సమావేశంలో ఎంఈఓ షేక్ కాలేషావలి మాట్లాడుతూ మండలంలోని ఆరు ఎంపీపీ పాఠశాలలో 10మంది విద్యార్థుల కంటే తక్కువగా ఉన్నారని, ఆ పాఠశాలల్లో వచ్చే ఏడాది 10 మంది కంటే పెరగకపోతే సమీపంలోని పాఠశాలలో విలీనం చేస్తారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా 10వ తరగతి విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణ సాధించేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో విద్యాబోధన చేస్తున్నట్లు తెలిపారు. పర్యవేక్షణ అధికారులను కలెక్టర్ రాజాబాబు నియమించినట్లు తెలిపారు. డాక్టర్ జాస్మిన్ మాట్లాడుతూ స్క్రబ్ టైఫస్ వ్యాధి పట్ల ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. మండలంలో ఒకరికి సోకితే చికిత్స చేసి రికవరీ చేసినట్లు తెలిపారు. ఈ వ్యాధి సోకే పురుగు మేతలో ఉంటుందని, రైతులు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. ఏదైనా నల్ల మచ్చ ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఎఒ ఎ తిరుమలరావు, ఆర్డబ్ల్యుఎస్ ఏఈ హనుమాన్ బాబు, ఇన్చార్జి పశు వైద్యాధికారి వంశీ, ఎపిఒ టీ వెంకటరావు, గృహ నిర్మాణ శాఖ ఏఈ వెంకటేశ్వరరెడ్డి, విద్యుత్ ఏఈ అంకబాబు, పంచాయతీరాజ్ ఏఈ ఎం వెంకటేశ్వర్లు, శిశు సంరక్షణ సూపర్వైజర్ సునీత, హాస్టల్ వార్డెన్ నరసింహారావు, డిప్యూటీ ఎంపిడిఒ మధుబాబు ఆయా శాఖల పరిధిలో పనులు వివరించారు. సమావేశంలో ఎంపిడిఒ ఎం శ్రీదేవి, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్ జనార్ధ న్, షేక్ అబ్దుల్ రహీం, ఆర్ నాగరాజు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాశక్తి - పంగులూరు**



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న అధికారులు

మండలంలోని రేణింగవరం నుండి అలవలపాడు వరకు రోడ్డు నిర్మాణానికి తహశీల్దారు సింగారావు శనివారం శంకుస్థాపన చేశారు. పల్లె పండగ 2.0లో భాగంగా రోడ్డు నిర్మిస్తున్నట్లు పంచాయతీరాజ్ డిఈ రమేష్ తెలిపారు. రెండు కిలోమీటర్ల దూరం 3.75 మీటర్ల వెడల్పుతో బిటి రోడ్డు నిర్మాణానికి రూ.2.8 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. 'మీకోసం' కన్స్ట్రక్షన్ అధినేత బొర్రెడ్డి ఓబులరెడ్డి మాట్లాడుతూ అలవలపాడు వెళ్లాలంటే ఇప్పటివరకు జాతీయ రహదారిపై వెళ్లి అక్కడ నుండి తిరిగి వెళ్లడం ప్రయాణికులకు ఇబ్బందిగా ఉందని అన్నారు. రేణింగవరం నుండి అలవలపాడు వరకున్న మట్టి రోడ్డు వర్షా కాలంలో గుంటలు పడి ఇబ్బందిగా మారుతుందని అన్నారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో రోడ్డు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అలవలపాడు, రేణింగవరం మధ్య ప్రయాణం సులభం అవుతుందని అన్నారు. చందలూరు నుండి ఇంకొల్లు మండలం గంగవరం వరకు రూ.2కోట్లతో బీటీ రోడ్డు నిర్మాణానికి, పంగులూరులో రూ.20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం, కశ్యంవారిపాలెంలో రూ.20లక్షలతో సిసి రోడ్ల నిర్మాణం, బూధవాడలో రూ.20 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి అధికారులు శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ స్వరూపరాణి, పంచాయతీ రాజ్ ఏఈ గడ్డం హనుమం తరావు, అలవలపాడు సర్పంచ్ జకరయ్య, తెలుగుదేశం నాయకులు మురవ కొండ సుబ్బారావు, చందలూరు సర్పంచ్ పెంట్యాల కృష్ణారావు, తెలుగుదేశం అధ్యక్షులు రావూరి రమేష్ బాబు, గుడిబండ్ల ఆదిరెడ్డి, కొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

# పెన్షనర్ల పట్ల నిర్లక్ష్యం వీడాలి..

**ప్రజాశక్తి - కనిగిరి**

రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలపై నిర్లక్ష్య వైఖరి వీడి తక్షణమే స్పందించాలని పెన్షనర్స్ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని డాక్టర్ గురుబ్రహ్మం ధ్యాన కేంద్రంలో పెన్షనర్స్ సంఘం అధ్యక్షులు టి పెద్దిరెడ్డి అధ్యక్షతన శనివారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పడి 18నెలలు గడిచినా ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారంలో సరైన స్పందన చూపడం లేదని ఆరోపించారు. 2024 జనవరి నుంచి కరవు భత్యం ప్రకటించకపోవడం ఆందోళనకరమని అన్నారు. 2023 జూలైలో ప్రకటించిన కరవు భత్యం బకాయిలు విడతల పద్ధతిలో చెల్లిస్తామని చెప్పడం గర్హనీయమన్నారు. ఇప్పటికీ గ్రాట్యుటీ చెల్లించలేదని అన్నారు. ఆరోగ్య కార్డులపై నగదు రహిత వైద్యం అందించాలని ఎన్నిసార్లు కోరినా స్పందన లేదన్నారు. సమావేశంలో సంఘం కార్యదర్శి ఆర్ఎంవిఎల్ నరసింహారావు, బోయళ్ల తిరుపతిరెడ్డి, మునిసిపల్ చైర్మన్, గౌరవ న్యాయ సలహాదారు షేక్ అబ్దుల్ గఫార్, ముక్కు వెంకటరెడ్డి, నాగభూషణం, మీగడ వెంకటేశ్వరరెడ్డి, ప్రభుత్వేతర ఉద్యోగుల సంఘ అధ్యక్షులు పిల్లి రమణారెడ్డి, వై ప్రభాకరరెడ్డి, బివి చెన్నయ్య, షేక్ మహమ్మద్ గౌస్, ప్రసాదరెడ్డి, నాగిరెడ్డి, శివరామిరెడ్డి, కరీముల్లా, వి మాలకొండారెడ్డి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో ప్రజలకు ఆరోగ్యం

**ప్రజాశక్తి - హనుమంతునిపాడు**

మన చుట్టూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని జిల్లా పంచాయతీ అధికారి ఎం వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండారెడ్డి పల్లి పంచాయతీని ఆయన శనివారం సందర్శించారు. ఇంటి పన్ను ఆన్‌లైన్ విధానం లేదా క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లించేలా ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. పారదర్శక వసూళ్లతో పంచాయతీ ఆదాయ వనరులు పెరుగుతాయని అన్నారు. పొడి చెత్త విక్రయించి నిధులకు జమ చేయాలని అన్నారు. సైడ్ కాలువలు తరచుగా శుభ్రం చేయాలని అన్నారు. ఎంపిడిఒ ఎం రంగ సుబ్బా రాయుడు, డిప్యూటీ ఎంపిడిఒ కె జయ ప్రకాష్ బాబు, సర్పంచ్ దేవకరుణమ్మ, పంచాయతీ సెక్రెటరీ షకీలా పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న డిడిఒ కె శ్రీనివాసరెడ్డి

## విధుల్లో నిర్లక్ష్యం వద్దు

**ప్రజాశక్తి - కనిగిరి**

డివిజన్ పరిధిలో జిఎస్‌డబ్ల్యుఎస్ కార్యక్రమాల అమలుపై డిడిఒ కార్యాలయంలో డివిజన్ డెవలప్మెంట్ ఆఫీసర్ కె శ్రీనివాసరెడ్డి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జీఎస్‌డబ్ల్యుఎస్ సర్వేలు, యుఎఫ్ఎస్ సర్వే, ఎంబియం, కౌశలం, ఈకేవైసీ, తల్లికి వందనం, ఆధార్ సేవలు, పెండింగ్ సేవల అంశాలపై చర్చించారు. వివిధ సేవల పెండింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలని చెప్పారు. ప్రజలకు అందుతున్న సేవల్లో ఆలస్యం జరగకుండా సమన్వయంతో పనిచేయాలని చెప్పారు.



వివరాలు తెలుసుకుంటున్న కోఆర్డినేటర్ సత్యసాగర్

## పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

**ప్రజాశక్తి - యద్దనపూడి**

మండలంలోని వింజనంపాడు ఎస్‌సి కాలనీలోని ప్రాథమిక పాఠశాలను సమగ్ర శిక్ష జిల్లా ఎఎల్ఎస్ కో ఆర్డినేటర్ వి సత్యసాగర్ శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో అమలు చేస్తున్న నో బ్యాగ్ డే పరిశీలించారు. నో బ్యాగ్ డే సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖన పోటీలు, స్మార్ట్ టివి ద్వారా సృజనాత్మక కథల ప్రదర్శన వీక్షించారు. పాఠశాలలో అమలవుతున్న 75 రోజుల జీఎఫ్ఎల్ఎన్ కార్యక్రమం పర్యవేక్షించారు. పాఠశాల రిజిస్టర్లు, మధ్యాహ్న భోజన పథకం కింద అందిస్తున్న భోజన నాణ్యత పరిశీలించారు. కార్యక్రమంలో సిఆర్ఎంటి ఎం ప్రేమ కుమార్ పాల్గొన్నారు.

## మహిళలకు ముగ్గుల పోటీలు

**ప్రజాశక్తి - అద్దంకి**

మండలంలోని సింగరకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పాలకవర్గ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ నెల 30న వైకుంఠ ఏకాదశి (ముక్కోటి) సందర్భంగా భక్తులకు అసౌకర్యం లేకుండా ఏర్పాట్లపై చర్చించారు. జనవరి 14న భోగి పండుగ సందర్భంగా మహిళలకు ముగ్గుల పోటీలు, శ్రీ లక్ష్మీనరసింహస్వామి కరావలంబ స్తోత్రం పఠనం పోటీలు, క్విజ్ పోటీలు అంశంపై చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. కార్యక్రమంలో పాలక మండలి అధ్యక్షులు గుంజి శ్రీనివాసరావు, కార్యనిర్వహణాధికారి మద్దినేని శ్రీనివాసరావు, మంగమూరి సురేష్ బాబు, రమణ, మహిళా సభ్యులు, అర్చకులు పాల్గొన్నారు.

## ఆలయానికి విరాళం

**ప్రజాశక్తి - అద్దంకి**

మండలంలోని సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానంలో ఒంగోలుకు చెందిన పుల్లంశెట్టి ఏడుకొండలు, శిరీష దంపతుల కుమార్తె రాజ్యలక్ష్మి, జైన్ స్వామివారికి రూ.1,00116 ప్రకార మండపాలు, గాలి గోపురాల నిర్మాణం నిమిత్తం పాలక మండలి అధ్యక్షులు చుండూరు మురళీ సుధాకరరావు, అసిస్టెంట్ కమిషనర్ మదమంచి తిమ్మనాయుడుకు శనివారం విరాళం చెక్కు అందజేశారు.

## సిమెంటు రోడ్లకు శంకుస్థాపన

**ప్రజాశక్తి - చినగంజాం**

మండలంలోని గొనసపూడిలో నూతనంగా సిమెంట్ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపాధి హామీ నిధులతో క్రొత్త సచివాలయం నుండి గ్రామ సప్తా వరకు, గ్రామ చప్తా నుండి కొమ్మమూరు కాలువ వరకు సిమెంట్ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. టీడీపీ అధ్యక్షులు పొద వీరయ్య, ఎంపిడిఒ కె ధనలక్ష్మి, పిఆర్ ఎఇ డి దాసు, ఎపిఒ జె లక్ష్మీదేవి, విక్రం వెంకటరావు, మాచాటి వెంకట్రావు, దావులూరి రమేష్, పరిటాల హనుమంతరావు, పొద హనుమంతరావు, మెడబలిమి చిట్టి బాబు పాల్గొన్నారు.

## మేము సైతం నినాదంతో

# కదిలిన కార్మిక లోకం

### సిఐటియు అఖిలభారత మహాసభలకు జిల్లావ్యాప్తంగా సంఘీభావం



ఒంగోలులో సిఐటియు ప్రచార జాతాలో మాట్లాడుతున్న నాయకులు

**ప్రజాశక్తి-ఒంగోలు సిటీ**

కార్మికుల హక్కుల సాధన, ఉద్యోగ భద్రత రక్షణ, ప్రజావ్యతిరేక విధానాలపై సమరానికి వేదికగా నిలవనున్న సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలన్న పిలుపు జయప్రదమైంది. సిఐటియు జిల్లా ప్రచార జాతాలకు రెండో రోజు శనివారం విస్తత సంఘీభావం లభించింది. మేము సైతం మహాసభల విజయానికి వెంట నడుస్తామంటూ పలు కార్మిక సంఘాలు ముందుకు రావడం విశేషం.

జిల్లా పశ్చిమ ప్రాంతంలో మార్కాపురం నుంచి ప్రారంభమైన ప్రచార జాతాను సిఐటియు నాయకులు రఫీ, సోమయ్య ప్రారంభించారు. తర్లుబాడు మీదుగా కంభం చేరుకున్న జాతాకు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఘన స్వాగతం పలికారు. మహాసభల విజయానికి ఆర్థిక, హార్థిక సహకారం అందిస్తామని ప్రకటించడంతో జాతాకు మరింత ఊతం లభించింది. యూనియన్ నాయకులు బి. రోశయ్య, ఎస్డీ కొత్తూరు, ఎస్కే నాజర్‌వలీ, రహిమాన్ల ఆర్థిక సహకారం కార్మిక ఐక్యతకు ప్రతీకగా నిలిచింది. అనంతరం బి.పేట మీదుగా గిద్దలూరు చేరింది. గిద్దలూరులో ఆవులయ్య నాయకత్వంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు ప్రచార జాతాకు సంఘీభావం తెలిపారు. అక్కడి నుంచి జాతా రాచర్ల-హనుమంతునిపాడు- వెలిగండ్ల మీదుగా సిఎస్ పురం చేరుకుంది.

**ఒంగోలు నగరంలో ఘన స్వాగతం..**

ఇక రెండో ప్రచార జాతా ఒంగోలు నగరం, కర్నూల్ రోడ్ బైపాస్‌లోని బిల్డింగ్ వర్కర్స్ కార్మికుల మెట్టు వద్ద ప్రారంభమైంది. సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి.మహేష్, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నగర కార్యదర్శి ఎస్‌డి.హుస్సేన్ నాయకత్వంలో జరిగిన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు కాలం సుబ్బారావు పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాల ప్రజావ్యతిరేక విధానాలపై కార్మిక వర్గం సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జివి కొండారెడ్డి, జిల్లా కార్యదర్శులు జి. శ్రీనివాసులు, పి. కల్పన, చీకటి శ్రీనివాసరావు, నగర నాయకులు బీవీ రావు, దామా శ్రీనివాసులు, జి. రమేష్, తంబి శ్రీనివాసులు పాల్గొన్నారు. జాతాకు పవర్ ఆఫీస్ వద్ద యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ కార్మికులు స్వాగతం పలికారు. ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర నాయకులు ఎం. అయ్యప్పరెడ్డి, ఒంగోలు డిపో కార్యదర్శి యు. హరిబాబు నాయకత్వంలో కార్మికులు జాతాలో పాల్గొన్నారు. అద్దంకి బస్టాండ్ వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే హుస్సేన్, ఎండీ బేక్, కొండారెడ్డిల ఆధ్వర్యంలో ఆటో కార్మికులు సంఘీభావం తెలిపారు. కొత్తపట్నం బస్టాండ్ వద్ద సివిల్ సప్లై ముఠా నాయకులు కే.గోపి, ఎం. వెంకట్రావు, సంజీవరావు, చంద్ర, మోహన్‌రావు జాతాకు స్వాగతం పలికారు. రైల్వే స్టేషన్, నెల్లూరు బస్టాండ్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద కూలీలు, రిమ్స్ పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు. ఒంగోలు మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన ప్రచార కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు టి. విజయమ్మ, జి. నరసింహ, యు. రత్నకుమారి, ఆర్. రాములు, కే. మోహన్‌రావు, సామ్రాజ్యం నాయకత్వంలో పారిశుధ్య కార్మికులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం కొప్పోలు మీదుగా కొత్తపట్నం చేరుకున్న జాతాలో స్వామిరెడ్డి, పి. కల్పన నాయకత్వంలో ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొని సిఐటియు మహాసభల విజయానికి తమ మద్దతును ప్రకటించారు.



మార్కాపురంలో సిఐటియు ప్రచార జాతాలో మాట్లాడుతున్న నేతలు

**మార్కాపురం:** సిఐటియు ప్రచార జాతా శనివారం మార్కాపురానికి చేరుకుంది. పట్టణంలోని స్థానిక గడియారం సెంటర్, నాయుడు బజార్ సెంటర్‌లో సభలు నిర్వహించారు. సభలలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జిల్లా ఉపాధ్యక్షులు డికేఎం రఫీ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండయ్య, రైతు సంఘం జిల్లా నాయకులు డి సోమయ్య, జి రాజశేఖర్‌రెడ్డి, సిఐటియు పట్టణ కన్వీనర్ పి రూబెన్, ఎస్‌ఎం భాష, కే సాంబశివరావు, నరసింహారెడ్డి, రజక వృత్తిసంఘం నాయకులు పొదిలి మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

**యర్రగొండపాలెం:** సిఐటియు ప్రచార జాతా యర్రగొండపాలెం చేరుకుంది. స్థానిక అంబేద్కర్ బొమ్మ సెంటర్‌లో జరిగిన సభలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు డీకేఎం రఫీ, నాయకులు ఆర్ మాలకొండయ్య, వెంకటరవణమ్మ, టి రామాంజి, జయలక్ష్మి, సుజాత, లక్ష్మి, కుమారి, పి జయ, ఎం వసుంధర తదితరులు పాల్గొన్నారు.

**కంభం:** సిఐటియు ప్రచార జాతా కంభం పట్టణానికి చేరుకుంది. జాతాకు బిల్డింగ్ వర్కర్స్, ఆటో ముఠా, పలక రిక్షా కార్మికులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, కంభం మండల కన్వీనర్ ఎస్‌కె అన్వర్ మాట్లాడారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బి.రోశయ్య, షేక్ నాసర్వలి, సయ్యద్ కొత్తూర్ ,ఎస్.కె రెహమాన్ ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు షేక్ మస్తాన్ వలి, కుద్దూసే, ఖాదర్ బాషా, సత్తార్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**హనుమంతునిపాడు:** సిఐటియు ప్రచార జాతా హనుమంతునిపాడు మండలంలోని వేములపాడుకు చేరుకుంది. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సిగినము తిరుపతయ్య, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

**వెలిగండ్ల:** సిఐటియు ప్రచార జాతా వెలిగండ్లకు రాగా... జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం రమేష్, జిల్లా కార్యదర్శి రాయల మాలకొండయ్య మాట్లాడారు. కార్యక్రమంలో సిగినము తిరుపతయ్య, జిఎంపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కండే బాలకృష్ణ, పగడాల చక్రిరావు, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# విస్తుపోయిన ప్రభుత్వం

**కూ**టమి ప్రభుత్వం విస్తుపోయింది. ఎందుకంటే ఎంతో ప్రతిష్టాత్మకంగా భావించి ప్రవేశపెట్టిన వాట్సాప్ గవర్నెన్స్ (మన మిత్ర) ఒకటుందనే విషయం 68 శాతం మంది ప్రజలకు తెలియలేదు. దాదాపుగా 200 రకాల సేవలు చిటికెలో అందుబాటులోకి తెచ్చామని ప్రభుత్వం పెద్దఎత్తున భజన చేసుకున్నా ఆ సేవలు ఏమిటో ప్రజలకు తెలియలేదని ప్రభుత్వం చేసిన సర్వేలోనే వెల్లడైంది. దీంతో ప్రభుత్వం ఈ విపత్కర పరిస్థితికి విస్తుపోయినట్లయింది. దీన్ని వెంటనే పెద్దఎత్తున ప్రచారం చేసి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. ఏదో సాధారణ విషయమైతే సమాచారం లేక తెలుసుకోలేదని భావించవచ్చు. ప్రభుత్వం అందించే సేవలే తెలియలేదంటే...ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య అంతరం ఎలా ఉందో చెప్పాల్సిన అవసరం లేదు. అర్జీలు ఇస్తేనే దిక్కులేదనే పరిస్థితి ఉందనే చర్చ సాగుతోంది. ఈ తరుణంలో వాట్సాప్‌లో సేవలపై నమ్మకం లేకనే జనం వాటిపై దృష్టి సారించలేదు. ఆన్‌లైనులో ఏ సమస్య కోసమైనా దరఖాస్తు చేసుకుంటే తర్వాత మళ్లీ సంబంధిత కార్యాలయానికి వెళ్లి మాట్లాడుకోకుండా ఏ పనులూ చేయడం లేదు. కొన్ని పనులకు ఆ శాఖ అధికారి చెప్పకుండా ఆన్‌లైనులో ధరఖాస్తు కూడా స్వీకరించడం లేదు.

జాతీయ ఉపాధి హామీ చట్టానికి మహాత్మాగాంధీ పేరుతో పాటు చట్టాన్ని కూడా మార్పు చేశారు. దీనిపై వామపక్షాలు అందోళన చేపట్టాయి. సిపిఎం తొలుత నిరసన కార్యక్రమం చేపట్టింది. తర్వాత వామపక్షాలు కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి. ప్రజాసంఘాలూ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కూటమి పార్టీలు మాత్రం మౌనంగా ఉన్నాయి. కొత్తగా తెచ్చిన మార్పుల వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై అదనపు భారం పడనుంది. దీనిపై పాలకపక్ష నేతల్లో చర్చ సాగుతున్నా కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని ప్రశ్నించలేకపోతున్నారు.

మెడికల్ కాలేజీపై పిపిపి విధానానికే కట్టుబడి ఉన్నట్లు ప్రభు త్వం మరోసారి స్పష్టం చేసింది. ఈ విధానం వల్ల వైద్యవిద్యతోపాటు వైద్యం పేదలకు దూరమవుతుందని వైసిపి, సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు, ప్రజా సంఘాలు ఆందోళనలు చేపట్టాయి. ఏదేమైనప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం మెడికల్ కాలేజీపై పిపిపి విధానంలోనే ముందుకు పోవాలని గట్టిపట్టుదలతో ఉంది.

రెండు రోజులపాటు జరిగిన కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబు అనేకశాఖలపై సమీక్ష చేశారు. జిల్లాలవారీగా సమీక్షలు చేశారు.జిల్లా స్థూల ఆదాయం విషయానికి వస్తే వ్యవసాయం నుంచి బాగా తగ్గినట్లు తేల్చారు. దీని వల్ల జిల్లాకు 15 వస్థానం దక్కింది. వ్యవసాయం ఇక్కడ పూర్తి సంక్షోభంలో ఉంది. దానికి తగ్గట్టుగానే ఆదాయం పడిపోయింది.దాని ప్రభావం స్థూలఉత్పత్తి, ఆదాయాలపై ప్రభావం స్పష్టంగా చూపింది. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కించేందుకు ప్రత్యామ్నాయాలు ఆలోచించాల్సిన అవసరం ఉంది.

## ఆటో డ్రైవర్ అంత్యక్రియలకు ఆర్థిక సాయం

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్ గాలేటి రాజు అంత్యక్రియలకు రూ. 10 వేలు ఆర్థిక సాయం అందించారు.ఒంగోలు నెహ్రూ కాలనీ చివర్లో ఉన్న గాలేటి రాజు లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతూ శనివారం మరణించాడు. అంత్యక్రియలకు ఇబ్బంది పడుతూ శివం పౌండేషన్‌ను సంప్రదించగా మానవత్వంతో అంత్యక్రియలకు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ మారెళ్ళ సుబ్బారావు, శివం ఫౌండేషన్ చైర్మన్ శ్రీహరి పాల్గొన్నారు

## 'ఓవర్‌లోడ్' వేస్తే చర్యలు తప్పవు..

- రవాణా సమయంలో పట్టలు కప్పాలి
- లారీ, ట్రాలీ యజమానులకు డిటిసి సుశీల ఆదేశం



మాట్లాడుతున్న డిటిసి సుశీల

**ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్**

మోటార్ వాహన చట్టం నియమ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఉప రవాణా కమిషనర్ ఆర్.సుశీల సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప రవాణా కమిషనర్ ఛాంబర్‌లో డిటిసి, గనులు, భూగర్భ జల శాఖ డిడి టి.రాజశేఖర్ సంయుక్తంగా టిప్పర్, లారీ, ట్రాలీ, క్రషర్ యజమానులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చీమకుర్తి, రామతీర్థం, మర్రిచెట్లపాలెం వంటి ప్రాంతాల నుండి అధిక బరువుతో భారీ వాహనాలలో గ్రానైట్, కంకర, బండరాళ్లు అధిక బరువు తోలటంతో రహదారులు పాడవుతున్నాయని, రహదారి ప్రమాదాలు జరుగుతూ ఉన్నాయని తెలిపారు. వాటిని నివారించాలని, వాహనాలు లోడుతో ఉన్నప్పుడు టార్పాలిన్ పట్టలను ఖచ్చితంగా కట్టాలని ఆదేశించారు. అలా చేయకపోతే వెంటనే కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. నియమనిబంధనలను ఉల్లంఘించి ఓవర్ లోడ్‌తో గ్రానైట్, కంకర, హిల్ రాక్స్, మినరల్స్ ఏదైనా తోలితే కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో మైన్స్ శాఖ టెక్నికల్ అసిస్టెంట్ సురేష్ బాబు, టి. రాజానాయుడు, రవాణా శాఖ మోటార్ వాహన తనిఖీ అధికారులు ఏ.కిరణ్ ప్రభాకర్, కె.రామచంద్రరావు, ఎల్.సురేంద్రప్రసాద్, ఎన్.జగదీష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## లిక్కర్ పార్టీలకు అనుమతి లేదు

### ఎస్పీ బి.ఉమామహేశ్వర్



ఎస్పీ బి.ఉమామహేశ్వర్

**ప్రజాశక్తి - బాపట్ల జిల్లా**

నూతన సంవత్సరం ఇతర వేడుకల సందర్భంగా రిసార్ట్స్, రెస్టారెంట్లు, హోటళ్లలో ఏవైనా కార్యక్రమాలు నిర్వహించాలంటే తప్పనిసరిగా పోలీస్ శాఖ నుండి ముందస్తు అనుమతి తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ తెలిపారు. లిక్కర్ పార్టీలకు అనుమతి లేదని, అటువంటివి ఎవరైనా నిర్వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. శనివారం జిల్లా పోలీస్ క్యాంప్ కార్యాలయ సమావేశ హాలులో బాపట్ల జిల్లా పరిధిలోని ప్రధానంగా సూర్యలంక, పాండురంగాపురం, వాడరేవు, రామాపురం బీచ్‌లు తదితర ముఖ్య ప్రదేశాలలో ఉన్న రిసార్ట్స్, హెూటల్ నిర్వాహకులతో జిల్లా ఎస్పీ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మద్యం సేవించి ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యాత్రికులు రాత్రి సమయాలలో ఒంటరిగా సముద్రంలోకి వెళ్లరాదని తెలియజేయాలన్నారు. మైనర్లు మాత్రమే వచ్చి రిసార్ట్స్, రెస్టారెంట్లు, హెూటళ్లలో రూములు కోరితే వారికి ఇవ్వవద్దని సూచించారు. డిసెంబర్ 31 రాత్రి నుంచి సంక్రాంతి పండుగ ముగిసే వరకు, ఆ తర్వాత కూడా సముద్ర తీర ప్రాంతాలలో ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగడానికి వీలు లేదన్నారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు పాల్గొన్నారు.